teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## చనిపోయిన 200మంది రైతుల వివరాలిస్తే పరిహారమిస్తం

**48గంటల్లోనే వివరాలిస్తే.. కోడ్ ముగిశాక ఆర్థికసాయం**

**ఎన్నికల కోడ్‌తో కొన్ని గ్యారెంటీలు ఇవ్వలేకపోయాం: రేవంత్**



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): పంటలు ఎండిపోక ముందే కేసీఆర్ మాకు చెప్పవచ్చు కదా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పంటలు ఎండిపోయిన తర్వాత ఆ మంటల వద్ద కేసీఆర్ చలికాచుకోవాలని అనుకున్నారని

మిగతా 2 లో

ములుగు | సంపుటి : 02 | సంచిక : 351 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 4 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

# ఎన్నికలకు ఈసీ సన్నద్ధం


## ఎన్నికల సక్రమ నిర్వహణకు ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ

**దేశంలో త్వరలో జరగనున్న పార్లమెంట్, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా శాంతి యుతంగా, హింసారహితంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల యంత్రాగానికి స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, భద్రతా బలగాల మోహరింపు, ఎన్నికల వ్యయ నిర్వహణ సెన్సిటివిటి,నోడలు అధికారుల నియామకం, నోటిఫికేషన్ ఆఫ్ డ్రై డే మరియు ఫెయిడ్ హాలిడే, అంతర్జాతీయ సరిహద్దు అంశాలపై బుధవారం ఢిల్లీ నుండి సహచర ఎన్నికల కమిషనర్లతో కలిసి సీఈసీ రాజీవ్ కుమార్ వివిధ రాష్ట్రాల సీఎస్, డీజీపీ, సీఈవోలు తదితర అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు.**

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఐదేళ్ళకు ఒకసారి ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ ఎన్నికలు ఏవిధంగా జరుగుతున్నాయని ప్రపంచ దేశాలన్నీ మనవైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కావున రానున్నఎన్నికలను స్వేచ్ఛగా శాంతి యుతంగా హింసా రహితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలకు పునరుద్ఘాటించారు. ఇప్పటికే మొదటి,రెండవ దశ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్లు జారీ అయ్యాయని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, డ్రగ్స్ వంటివి ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సీఎస్, డీజీపీ,సీఈవోలకు స్పష్టం చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు ఎక్కడైనా తనిఖీల నిర్వహణలో

మిగతా 2 లో





# ఉదయం నుంచే భానుడి భగభగలు

### ఎండలకుతో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు

**తెలంగాణలో ఎండల తీవ్రత విపరీతంగా పెరిగింది. ఉదయం నుంచే భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఇప్పటికే ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 41 డిగ్రీలకు చేరాయి. ఎండలకు తోడు వడగాలులు సైతం వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాబోయే రెండు మూడునెలలు ఎండలు, వడగాలుల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని తెలిపింది.**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): ఈ క్రమంలో ఎండలు, వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని భారత వాతావరణ శాఖ సూచించింది. అయితే, వైద్య నిపుణులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఎండలో తిరిగడం వల్లే కాకుండా ఇంట్లో ఉన్న పలు సందర్భాల్లో వడదెబ్బ ముప్పు తప్పదని

మిగతా 2 లో

# ఏ4 రాధాకిషన్ రావు కస్టడీ కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్

### 7 రోజుల కస్టడీకి అనుమతినిస్తూ ఆదేశాలు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతంగా నడుస్తోంది. ఈకేసులో ఏ4గా ఉన్న రాధాకిషన్ రావు కస్టడీ కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌పై బుధవారం నాంపల్లి కోర్టు విచారించింది. రాధాకిషన్‌రావుకు 7 రోజుల పోలీసు కస్టడీకి

మిగతా 2 లో



# మంత్రి కొండ సురేఖతో పాటు మరో ఇద్దరు నేతలకు లీగల్ నోటీసులు

**అన్నంత పనిచేసిన మాజీ మంత్రి కేటీఆర్**

**కేటీఆర్ కు కౌంటర్ ఇచ్చిన కొండా సురేఖ**



హైదరాబాద్, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి కేటీఆర్ అన్నంత పనిచేశారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖతో పాటు కాంగ్రెస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన కేటీఆర్ పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన మంత్రి కొండ సురేఖకు, మరో ఇద్దరు కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు పంపించారు.

**కొండా సురేఖకు కేటీఆర్ వార్నింగ్**

ఫోన్ ట్యాపింగ్ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో మండిపడిన కేటీఆర్ తన ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రకటనలు చేసినందుకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే

మిగతా 2 లో

# డాక్టర్ నిర్లక్ష్యంతో రోగి మరణిస్తే ఐదేళ్లు జైలు శిక్ష

**ఈ చట్టంపై అవగాహనకు డైరెక్టర్ జనరల్ ఆఫ్‌హెల్త్ సర్వీసెస్ అన్ని రాష్ట్రాల సీఎస్, హెల్త్ సెక్రటరీలకు లేఖ**

**ప్రస్తుతం ఉన్న రెండేళ్ల కాలాన్ని పెంచుతూ కొత్త చట్టాలను రూపొందించిన కేంద్రం**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): నిర్లక్ష్య వైద్యంతో రోగి మరణానికి కారణమైతే సదరు డాక్టర్‌కు ఇక నుంచి ఐదేళ్లు జైలు శిక్షను విధించనున్నారు. ప్రస్తుతం ఉన్న రెండేళ్ల కాలాన్ని పెంచుతూ కొత్త చట్టాలను రూపొందించారు. ఈ మేరకు వైద్యులకు అవగాహన కల్పించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్‌హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ అతుల్ గోయల్ అన్ని రాష్ట్రాల సీఎస్, హెల్త్ సెక్రటరీలకు లేఖ రాశారు. ప్రస్తుతం నిర్లక్ష్యంగా వైద్యం చేసి రోగి

మిగతా 2 లో



## బహిరంగ చర్చకు రావాలని మందకృష్ణ కడియంకు సవాల్

### తన బిడ్డ భవిష్యత్ కోసమే అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడని విమర్శలు

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): శ్రీహరి ఎమ్మార్పీఎస్ మీద, తమ మీద వ్యక్తిగత విమర్శలు చేశారని ఎమ్మార్పీఎస్ జాతీయాధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఫైర్ అయ్యారు. తన స్వార్థాన్ని, తన అవకాశవాదాన్ని కప్పి పుచ్చుకోవడానికి మా మీద నిందరోపణ చేసే ప్రయత్నం చేశాడన్నారు. తన బిడ్డ భవిష్యత్ కోసమే అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడని ఆయన విమర్శలు గుప్పించారు. పక్క వాళ్ల ఎదుగుదలను జీర్ణించుకోలేని కుళ్లు

మిగతా 2 లో





# రాష్ట్రంలోలానే.. కేంద్రములో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

**కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుంది**

**ఓ సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో మాదిరిగానే కేంద్రములో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని రాష్ట్ర మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. 10 సంవత్సరాలకు ఒకసారి రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వాలు మారడం ఆనవాయితీ అని అన్నారు. ములుగు జిల్లా జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ములుగు, వెంకటాపూర్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ పాల్గొన్నారు. దేశంలో పది సంవత్సరాలు పరిపాలన చేసిన బీజేపీ మళ్ళీ అధికారంలోకి

మిగతా 2 లో

## ఉదయం నుంచే భానుడి భగభగలు

మొదటి పేజీ తరువాయి

హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కీలక సూచనలు చేశారు. ఎండలో పనిచేయడం, ఆటలు ఆడడంతో పాటు చెప్పులు లేకుండా ఆరుబయట తిరగొద్దని సూచించారు. పార్క్ చేసిన వాహనాల్లోకి పిల్లలు, పెట్స్ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగంటలలోపు వంటగదికి సైతం దూరంగా ఉండడం మంచిదన్నారు. మద్యం, టీ, కాఫీ, స్వీట్స్, కూల్‌డ్రిక్స్‌కు సైతం దూరంగా ఉండాలని చెప్పారు. శరీర ఉష్ణోగ్రతలు 40.5 సెంటిగ్రేడ్ కంటే ఎక్కువగా ఉండడం, విపరీతమైన చెమట, దాహం వేయడం, మగత, బలహీనత, తలతిప్పడం, కండరాలు పట్టేయం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తంగా ఉండి వైద్యులను సంప్రదించాలని సూచించారు.

**అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు : డాక్టర్ రాజారావు**

గాంధీ ఆసుప్రతి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు సైతం ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇంట్లో ఉన్న సమయంలో ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల వద్ద ఉండాలని చెప్పారు. అదే సమయంలో ఇంట్లోకి వేడిగాలులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇంట్లోకి వడగాల్పులు రాకుండా కర్టెన్లను వాడాలన్నారు. ఇంట్లో ఉన్న సమయంలో తరుచూగా నీరు తాగాలని ఉప్పు, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు తీసుకోవడం ద్వారా ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభించి వడదెబ్బ నుంచి కాపాడుతాయని చెప్పారు. ఎండల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీసం నాలుగు లీటర్ల వరకు నీటిని తాగాలని ఎండలో పని చేసేవారు మరో లీటర్ నీటిని అదనంగా తీసుకోవాలని సూచించారు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని, అవి చెమటను పీల్చి శరీరం చల్లబరుస్తాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటలలోపు ఎండలో తిరగొద్దని అత్యవసరమై బయటకు వెళ్తే గొడుపు తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలన్నారు. వేసవిలో ఎక్కడ పడితే అక్కడ నీరు తాగడం ఏమాత్రం సరికాదని బయటకు వెళ్లిన సమయంలో వెంట వాటర్ బాటిల్స్‌ను తీసుకెళ్లాలని చెప్పారు. తాజాగా వండిన ఆహారం తీసుకోవాలని బయట తినడం మానుకోవాలని తెలిపారు. వేసవిలో మద్యానికి దూరంగా ఉండాలని డీహైడ్రేషన్ బారినపడేలా చేస్తుందన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిలో ఓఆర్ఎస్ కలుపుకొని తాగడం తాగాలని తద్వారా డీహైడ్రేషన్ బారినపడకుండా చూసుకోవచ్చన్నారు. మధుమేహం, హై బీపీ రోగులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే డీహైడ్రేషన్‌తో బీపీ తగ్గి ఉంటుందన్నారు. ఈ సమయంలో బీపీ మందులు వేసుకుంటే మరింత ప్రమాదకరంగా మారుతుందన్నారు. బీపీ రోగులు డీహైడ్రేషన్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వాంతులు, విరేచనాలు, అపస్మారక స్థితిలో ఉంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని డాక్టర్ రాజారావు సూచించారు.

## ఏ4 రాధాకిషన్ రావు కస్టడీ కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్

మొదటి పేజీ తరువాయి

అనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గురువారం నుంచి 7 రోజుల పాటు రాధాకిషన్‌రావును పోలీసులు ప్రశ్నించనున్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావును నిందితులుగా చేర్చిన విషయం తెల్సిందే. కాగా, రాధాకిషన్ రావు రిమాండ్ రిపోర్టులో పోలీసులు కీలక అంశాలను పొందుపరిచారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 2016లో ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్‌రావును నియమించారని, అదే సామాజికవర్గానికి చెందిన అధికారులును ఏరి కోరి మరీ ప్రభాకర్ రావు తన టీంలో నియమించుకున్నట్లు నివేదికలో పొందుపరిచారు. ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులు, వారి మద్దతుదారులు, వ్యాపారస్తులతో పాటు బీఆర్ఎస్ విమర్శకులు కూడా అధినేత నియంత్రణలోనే ఉండేలా ఈ బృందం నిఘా పెట్టినట్లు రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. నల్గొండ నుంచి ప్రణీత్‌రావు, రాచకొండ కమిషనరేట్ నుంచి భుజంగరావు, హైదరాబాద్ సిటి నుంచి తిరుపతన్న, సైబరాబాద్ నుంచి వేణుగోపాల్‌రావును ఎస్ఐబీకి బదిలీ చేయించుకున్నారు. కీలకమైన టాస్క్‌ఫోర్స్ డీసీపీ పోస్టులో బీఆర్ఎస్ సుప్రీమో అదేశాలతో 2017లో రాధాకిషన్‌రావును నియమించారు. శాఖాపరమైన వ్యవహారాలతో పాటు రాజకీయ పరంగా నిఘా పెట్టేందుకు అతనికి ఆదేశాలు జారీ చేశారు. వీరు నలుగురూ తరుచూ కలుస్తూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు రాధాకిషన్‌రావు తెలిపారు. అంతేగాక, వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గట్టుమల్లును, ప్రభాకరావు ఆదేశాల మేరకు ఎస్ఐబీకి బదిలీ చేశారు. వీరి కార్యకలాపాలను ఇతరులు గమనించకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకునే వారని వెల్లడించారు. ముందు జాగ్రత్త చర్యగా సోషల్‌మీడియా యాప్స్ అయిన వాట్సాప్, సిగ్నల్, స్నాప్‌చాట్‌లలో మాత్రమే తరచూ సంప్రతింపులు జరుపుకున్నట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. రాధాకిషన్‌రావు తన సామాజికవర్గాన్ని అడ్డుపెట్టుకుని, అప్పటి ప్రభుత్వ పెద్దల అండదండలతో సర్వీస్ 2020 ఆగస్టులో ముగిసినా.. మరో మూడేళ్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగానే కొనసాగినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## మంత్రి కొండ సురేఖతో పాటు మరో ఇద్దరు నేతలకు లీగల్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. అవసరమైతే కోర్టుకు వెళతానని తనపైన చేస్తున్న అబద్ధపు ఆరోపణలను ఎదుర్కొంటానని కేటీఆర్ వెల్లడించారు.

**కౌంటర్ ఇచ్చిన కొండా సురేఖ**

ఇక కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కొండా సురేఖ లీగల్ నోటీసులు ఇస్తే భయపడేది లేదని, తాము కూడా అందుకు సిద్ధంగానే ఉన్నామని స్పష్టం చేశారు. కేటీఆర్ భయంతో దిగజారి మాట్లాడుతున్నారని, కేటీఆర్ భాష మార్చుకుంటే మంచిదంటూ హితవు పలికారు. ఇక ఈ మాటల తూటాలు పేలుతున్న క్రమంలోనే తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు.

సురేఖతో పాటు వారికి లీగల్ నోటీసులు

మంత్రి కొండా సురేఖ తో పాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నేత కేకే మహేందర్ రెడ్డి పై పరువు నష్టం దావా వేసి నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా, పదే పదే తన పేరును ప్రస్తావించి కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

**ముఖ్యమంత్రి అయినా వదిలిపెట్టనన్న కేటీఆర్**

ఇలా మాట్లాడే వారిపై తాను న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని ఇప్పటికే చెప్పిన కేటీఆర్ ఆధారాలు లేకుండా తన పేరును ప్రస్తావిస్తూ అసత్యాలు రాస్తున్న కొన్ని మీడియా సంస్థలకు యూట్యూబ్ ఛానల్స్ కు కూడా ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపైన అసత్యాలు ప్రచారం చేస్తే ముఖ్యమంత్రి అయినా వదిలిపెట్టేది లేదన్నారు.

**లీగల్ నోటీసులు పంపిన కేటీఆర్, కొండా స్పందన ఏంటో**

ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్ గా తీసుకుంటున్న కేటీఆర్ ప్రస్తుతం కొండా సురేఖ తో పాటు, మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నేతలకు లీగల్ నోటీసులు పంపించారు. మరి కేటీఆర్ పంపించిన లీగల్ నోటీసులపై కొండా సురేఖతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎలా స్పందిస్తారో తెలియాల్సి ఉంది.

## రాష్ట్రంలోలానే.. కేంద్రములో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మొదటి పేజీ తరువాయి

రావడం ఒక కల అని ఆమె అన్నారు. కేంద్రంలో అధికారంలోకి రాలేమని తెలిసిన బీజేపీ, ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడుతూ జైల్లో పెడుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో దేశంలో ఇందిరమ్మ రాజ్యం అవసరమన్న మంత్రి.. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చెయ్యడమే మన లక్ష్యమని కాంగ్రెస్ నేతలకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలు అమలు చేశామన్నారు. బీఆర్ఎస్ 10 ఏండ్ల పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేశారని విమర్శించారు. రైతును రాజును చేయడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు 10 లక్షల జీవిత భీమా ఇస్తామన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## డాక్టర్ నిర్లక్ష్యంతో రోగి మరణిస్తే ఐదేళ్లు జైలు శిక్ష

మొదటి పేజీ తరువాయి

ప్రాణాలు తీసే వైద్య సిబ్బందికి ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశం ఉన్నది. కానీ దేశవ్యాప్తంగా ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రాబోతున్న నూతన న్యాయ చట్టం ప్రకారం కచ్చితంగా జైలు శిక్ష పడే అవకాశం ఉన్నదని కేంద్ర వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అంతేగాక గరిష్ఠంగా ఐదేండ్ల శిక్ష పడేలా చట్ట సవరణ జరిగిందని గుర్తు చేసింది. డాక్టర్ అయితే ఐదేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారని, ఆర్ఎంపీ అయితే (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) రెండేండ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉన్నదని కేంద్రం పేర్కొన్నది. ప్రస్తుతం దేశంలో ఇండియన్ పీనల్ కోడ్ 1860 అమల్లో ఉండగా, దీని స్థానంలో కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సక్ష్య అభియాన్ పేరుతో మూడు కొత్త చట్టాలు అమల్లోకి రానున్నాయి.

# ఎన్నికలకు ఈసీ సన్నద్ధం

మొదటి పేజీ తరువాయి



నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి బృందాలపై జిల్లా యంత్రాంగాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిఇసి రాజీవ్ కుమార్ ఆదేశించారు. ముఖ్యంగా పోలింగ్‌కు 48 గంటల ముందు (సైలెంట్ ఫిరియడ్)ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం వంటి తాయిలాల పంపిణీకి ప్రయత్నాలు జరుగుతాయని అలాంటి చర్యలను కట్టుదిట్టంగా నియంత్రించేందుకు మోడల్ కోడ్ బృందాలు మరింత నిఘా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలను సజావుగా సక్రమంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని విధాలా కట్టుబడి పూర్తి సన్నద్ధమై ఉందని ఈప్రక్రియలో అన్ని రాష్ట్రాలు పూర్తి సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సిఇసి రాజీవ్ కుమార్ సూచించారు. ఎన్నికల్లో అన్ని పార్టీలకు వివిధ అంశాల్లో సమాన అవకాశాలు కల్పించాలని అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా వచ్చి నిర్భయంగా వారి ఓటు హక్కును వినియోగించుకునే ప్రశాంతమైన వాతావరణాన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని సిఇసి రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. ఎక్కడా రీ పోలింగ్ కు అవకాశం లేని విధంగా రానున్న ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్ట అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుండి ఇప్పటి వరకు 258 కోట్ల రూపాయలు విలువైన నగదు, మద్యం, డ్రగ్స్,ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఏపీతో ఐదు రాష్ట్రాలు అంతర్ రాష్ట్ర సరిహద్దులను కలిగి ఉన్నాయని, రాష్ట్ర సరిహద్దుల్లో 150 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశాంత మరియు స్వేచ్ఛాయుత, హింసా రహిత ఎన్నికల నిర్వహణకు అన్నిచర్యలు తీసుకుంటున్నా మని సిఎస్ జవహర్ రెడ్డి వివరించారు. శాంతి భద్రతల అంశానికి సంబంధించి సరిహద్దు రాష్ట్రాలైన ఒడిస్సా, ఛతీష్గడ్ నుండి కొంత మేర మావోయిస్టుల సమస్య ఉందని ఆ సమస్యను అధిగ మించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో 132 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, 632 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని సీఎస్ జవహర్ రెడ్డి సీఈసీకి వివరించారు. పోలీస్ డైరెక్టర్ జనరల్ కెవి. రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ సరిహద్దు రాష్ట్రాలైన ఒడిస్సా, ఛతీస్‌గఢ్ రాష్ట్రాల నుండి కొంత వరకు మావోయిస్టుల ప్రాబల్యం ఉందని ఇందుకు సంబంధించి 91 పోలింగ్ కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నా మని చెప్పారు. ఇటీవల మహారాష్ట్రకు 10 కంపెనీల పోలీసు బలగాలను పంపామని వాటిని తిరిగి పంపాలని కోరారు. రాష్ట్రానికి అదనపు బలగాలను పంపాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ఈ వీడియో సమావేశంలో సీఈవో ముకేశ్ కుమార్ మీనా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నీరబ్ కుమార్ ప్రసాద్, రజత్ భార్గవ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్త,అదనపు డీజీపీ ఎస్.బాగ్చి, చీఫ్ కమీషనర్ స్టేట్ టాక్స్ గిరిజా శంకర్, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, ఎస్ఐబి డైరెక్టర్ యం.రవి ప్రకాశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నీటి నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**నీళ్ల నిర్వహణ కోసం ప్రత్యేక ఐఏఎస్‌ల నియామకం**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో నీటి నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా వాటర్ మేనేజ్మెంట్ అవసరాలు, నిర్వహణ కోసం ప్రత్యేక ఐఏఎస్ అధికారులను సర్కార్ నియమించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు. ఉమ్మడి పది జిల్లాలకు మొత్తం పది మంది ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. అలాగే రానున్న రెండు నెలల పాటు అధికారులు ఎవరూ సెలవులు పెట్టకూడదంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాల వారీగా త్రాగునీటి సమస్యలు రాకుండా ఐఏఎస్ అధికారులకు నిర్వహణ బాధ్యతలను సర్కార్ అప్పగించింది.

**ప్రత్యేక ఐఏఎస్ అధికారులు వీరే**

ఆదిలాబాద్, నిర్మల్ - ప్రశాంత్ జీవన్ పాటిల్

కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల్ - కృష్ణ ఆదిత్య ఐఏఎస్

కరీంనగర్, జగిత్యాల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లకు - ఆర్ వి కర్ణన్ నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట - అనిత రామచంద్రన్

నిజామాబాద్, కామారెడ్డి - శరత్ ఐఏఎస్

రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి - విజయేంద్ర ఐఏఎస్మహబూబ్‌నగర్, నారాయణపేట్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నాగర్ కర్నూల్ - శృతి ఓజ వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ - గోపి ఐఏఎస్

మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట - భారతి కొలిగేరి నియామకం ఖమ్మం భద్రాద్రి, కొత్తగూడెం-సురేంద్రమోహన్ ఐఏఎస్ నియామిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

## జైలులో కేజ్రీవాల్ కు వసతులు కల్పించాలని ఆదేశించిన దిల్లీ కోర్టు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): తిహాడ్ జైలులో ఉన్న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు అవసరమైన కొన్ని వసతులు కల్పించాలని జైలు అధికారులను దిల్లీ కోర్టు ఆదేశించింది. ఆయన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలోఉంచుకొని ఎలక్ట్రిక్ కెటిల్‌తో పాటు పుస్తకాలు చదువుకునేందుకు వీలుగా ఒక టేబుల్, కుర్చీని ఏర్పాటుచేయాలని సూచించింది. మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈడీ కస్టడీ ముగిసిన తర్వాత ఈనెల 15 వరకు జ్యూడీషియల్ కస్టడీ విధించడంతో ఆయన్ను తిహాడ్ జైలుకు తరలించారు. కేజ్రీవాల్ ఆరోగ్యం దృష్ట్యా జైలులో నీటిని వేడి చేసుకొనేందుకు, టీ తాగడానికి ఎలక్ట్రిక్ కెటెల్ అవసరమని ఆయన తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థన మేరకు రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా తాజా ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 1న సీఎంను జైలుకు తరలించినప్పుడు ఆయనకు కుర్చీ, టేబుల్ అందించాలని జడ్జి ఆదేశించలేదని న్యాయవాది తెలిపారు. దీనిపై జడ్జి స్పందిస్తూ నిందితుడి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మాత్రమే ఎలక్ట్రిక్ కెటిల్ అందించాలనే అభ్యర్థనను అనుమతిస్తామన్నారు. అనుమతించిన పుస్తకాలను చదివేందుకు దరఖాస్తుదారుకు టేబుల్, కుర్చీ అవసరమని చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్నాకే జైలు మాన్యువల్ ప్రకారం నిందితులకు కుర్చీ, టేబుల్ అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జైలు మాన్యువల్ కాపీని కూడా కేజ్రీవాల్‌కు అందించేందుకు ఆథరైజ్డ్ న్యాయవాదిని అనుమతించాలని సూచించారు.

మరోవైపు, కేజ్రీవాల్ భారీగా బరువు తగ్గారని ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు చేస్తోన్న ఆరోపణలపై తిహాడ్ జైలు అధికారులు స్పందించారు. ఆయన ఆరోగ్యంపై వైద్యులు ఎటువంటిఆందోళన వ్యక్తం చేయలేదని, పూర్తి ఆరోగ్యంగానే ఉన్నారని చెబుతున్నారు. బుధవారం ఉదయం సీఎం తన గదిని చీపురుతో స్వయంగా శుభ్రం చేసుకున్నట్లు కనిపించారు.

## రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

**బీజేపీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేటీఆర్**

వికారాబాద్, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య డైలాగ్ వార్ షురువైంది. సోమవారం వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే ట్విట్టర్ వేదికగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'ఒక్క రాత్రిలో ఎంత మార్పు వచ్చింది. జై శ్రీరామ్ నినాదం మీకు తిండి లేదా ఉద్యోగం ఇవ్వదు నుంచి రాముడిని ప్రార్థిద్దాం వరకు వచ్చిందని, ఇది రాముడు, రామ భక్తుల శక్తి వల్లే అంటూ సెటైర్లు వేశారు. 'భక్త రామదాసును జైల్లో పెట్టిన తానాషా లాగా, శ్రీరాముడిని కలలో చూసి, రామ ముద్రలు దొరికినట్లే, కేసీఆర్ కొడుకుకు రాత్రికి రాత్రే జ్ఞానోదయం అయినట్లు కనిపిస్తోందంటూ ఇచ్చిన కౌంటర్ ట్వీట్.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## ఇంటర్ మొదటి సం. అడ్మిషన్ కోసం నోటిఫికేషన్ జారీచేయలేదు

**ప్రైవేట్ కళాశాలలు అనధికార అడ్మిషన్‌ల ప్రచారంలో బోర్డు కీలక ప్రకటన**

**ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ప్రకటన విడుదల**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఇంటర్ మొదటి సంవత్సరం (2024 -25) విద్యా సంవత్సరానికి అడ్మిషన్ కోసం ఎలాంటి నోటిఫికేషన్ షెడ్యూలును జారీచేయలేదని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అనధికార అడ్మిషన్‌లు చేసుకుంటున్నాయని పలు మాధ్యమాల్లో ప్రచారం సాగుతున్న తరుణంలో ఇంటర్ బోర్డు ఈ కీలక ప్రకటన చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల జాబితా ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లలో tsbie.cgg.gov.in acadtsbie.cgg.gov.in లలో పొందుపరచడం పెరుగుతుందని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో పొందుపర్చిన కళాశాలలో మాత్రమే తల్లిదండ్రులు తమ పిల్లలను అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. షెడ్యూల్ కంటే ముందుగానే అడ్మిషన్ ప్రక్రియ చేపడితే అట్టి కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. అడ్మిషన్ షెడ్యూల్‌కు కంటే ముందు జూనియర్ కాలేజీలలో అడ్మిషన్లు తీసుకోవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకులు రాఘువేంద్ర రావు సూచించారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్నత విద్య, విశేష అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత విద్యార్థులకు బోధించడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ కళాశాలలో విశాలమైన గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య విద్యార్థులకు చక్కటి విద్యాబోధనతో మంచిగా రాణించగలుగుతారని పేర్కొన్నారు.

## చనిపోయిన 200మంది రైతుల వివరాలిస్తే పరిహారమిస్తం

మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ వద్ద 6న కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోయే బహిరంగసభ ఏర్పాట్లను రేవంత్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ కేసీఆర్ చేసిన విమర్శలను ప్రస్తావించారు. పంటలు ఎండిపోకముందే కేసీఆర్ తమకు ఈ విషయం చెప్పి ఉండాల్సిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు వందల మంది రైతులు చనిపోయారని అంటున్నారని, ఆ వివరాలను తమకు అందిస్తే బాధిత రైతు కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తామని వివరించారు. అయితే, అందుకు 48 గంటలు మాత్రమే సమయం ఇస్తున్నామని చెప్పడం గమనార్హం. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. కోడ్ అమల్లోకి వచ్చాక పాలన ఎన్నికల సంఘం చేతుల్లోకి వెళ్లడంతో కొన్ని హామీలు నెరవేర్చలేకపోయినట్టు చెప్పారు. రైతులకు సాయం చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ పదేం డ్ల తర్వాత పొలంబాట పట్టడం సంతోషకరమని తెలిపారు. మాజీ సీఎం అయిన కేసీఆర్‌కు ఏ సీజన్‌లో కరువు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు. నిరుడు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే వర్షాలు కురవలేదని, ఆ కారణంగానే కరువు వచ్చిందని చెప్పారు.

ఇప్పుడు ఆ పాపాలను తమ ఖాతాలో వేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు వేసేందుకు 10 నెలల సమయం తీసుకుందని, వారు ఎప్పుడెప్పుడు రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశారో ఆ వివరాలన్నీ ఉన్నాయని, కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చూపించాలని అనుకుంటున్నట్టు చెప్పారు. తాము ఇప్పటికే 65 లక్షల మంది రైతుల ఖాతాలో డబ్బులు జమచేశామని, మిగిలింది 4 లక్షలమంది రైతులేనని తెలిపారు.

## బహిరంగ చర్చకు రావాలని మందకృష్ణ కడియంకు సవాల్

మొదటి పేజీ తరువాయి

బుద్ధి వున్నా వ్యక్తి కడియం శ్రీహరి అంటూ మండిపడ్డారు. తాటికొండ రాజయ్య ఎదుగుదలను అడ్డుకునేందుకు కుట్రలు చేశాడని ఆరోపించారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో తాను మాత్రమే ఏదిగాడు, ఇప్పుడు తన కూతురి ఎదుగుదలకు తపన పడుతున్నాడన్నారు. లేనిపోని మాటలు చెప్పి మాదిగల ఎదుగుదలకు అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. దళితులను, మాదిగలను ఉపయోగించుకొని ఎదిగాడన్నారు. కాంగ్రెస్‌లో చేరాడు, తన బిడ్డకి టికెట్ తెచ్చుకున్నాడు.. ఎంత అవకాశవాదో తెలుస్తుందని మందకృష్ణ అన్నారు. సిట్టింగ్ ఎంపీగా వున్నా దయాకర్‌కి టికెట్ ఇస్తే.. దయాకర్ గెలిస్తే తన పరువు పోతుందని కాంగ్రెస్‌లో చేరాడన్నారు. బీఆర్ఎస్‌లో వున్నప్పుడు మాదిగలకు అన్యాయం చేశాడని.. మళ్ళీ కాంగ్రెస్‌లో చేరి మాదిగల ఎదుగుదలకు అడ్డుపడుతున్నాడన్నారు. ఘనపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయినా కూడా ఇందిరా కాంగ్రెస్‌నే నమ్ముకున్నది. అయినా కూడా తనకు టికెట్ రాకుండా అడ్డుపడ్డాడని అన్నారు. ఎమ్మార్పీఎస్, మందకృష్ణ మాదిగ ఎదుగుదలకు తానే కారణమన్నాడని ఇది ఒక్క పచ్చి అబద్ధమన్నారు. దళిత దొర అని ఆనాడు కడియం శ్రీహరికి పేరు ఉన్నదన్నారు. నువ్వు మాదిగలకు చేసిన మేలు గోరంతా, ద్రోహం కొండంత అంటూ తీవ్రంగా మండిపడ్డారు. ధైర్యం ఉంటే బహిరంగ చర్చకు రావాలని మందకృష్ణ మాదిగ కడియం శ్రీహరికి సవాల్ విసిరారు. ఎమ్మార్పీఎస్‌కు చేసిన మేలు ఏంటో చెప్పాలన్నారు. మేము నువ్వు చేసిన ద్రోహాలు ఎన్ని ఉన్నాయో తెలుపుతామని మీకు దమ్ముందా అంటూ సవాల్ చేశారు. తన అవకాశాల కోసం చాలా పార్టీ లు మారుతున్నాడన్నారు. ఉద్యమకాలంలో కేసీఆర్ అని కూడా తిట్టావ్ నువ్వు ఎవరి చేతిలో అధికారం ఉంటే వాళ్ళను పొగుడుతావంటూ విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌పై గౌరవం ఉందన్న మీరు పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు తోడు ఉండాలి కదా అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఉన్న మాదిగ బిడ్డలు కడియం శ్రీహరి, ఆయన బిడ్డ తరపున ప్రచారానికి వెళ్లొద్దన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# తారెత్తిస్తున్న ఎండలు!

భూమిపై అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డులకెక్కింది. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఏడాది తిరగక ముందే ఈ రికార్డును 2024 తిరగరాస్తుందేమోనని అనిపించకమానదు. ఈ ఏడాది ఆరంభం నుంచే ఎండలు భగ్గుమంటున్నాయి. ఫిబ్రవరి రెండో వారం వచ్చేసరికి మధ్య వేసవిని మరపించడమూ మొదలైంది. ఈ నేపథ్యంలో రాబోయే మూడు నెలలూ మండుటెండలేనంటూ భారత వాతావరణ విభాగం (ఐఎండి)చేస్తున్న హెచ్చరికలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే ఇక మే నెలలో ఎలా ఉంటాయోనని సామాన్యుడు బెంబేలెత్తడం సహజమే. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తుంటే.. వేసవి కాలాన్ని పునర్నిర్వచించుకోవాలేమోనని అనిపిస్తోంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఈసారి వేడిగాలుల ప్రభావం కూడా తీవ్రమేనని ఐఎండి పేర్కొంటోంది. సాధారణంగా ఏప్రిల్ రెండో వారం నుంచీ భానుడి ప్రతాపం మొదలవుతుంది. ఈసారి ఏప్రిల్ మొదటి రోజునే పగటి ఉష్ణోగ్రతలు తెలుగునాట కొన్ని చోట్ల 43 డిగ్రీల సెల్సియస్ దాటడం రానున్న గడ్డు పరిస్థితులకు సంకేతంగా భావించవచ్చు. ఒకవైపు ఎండలు తారెత్తిస్తుండగా మరోవైపు భూగర్భ జలాలు అంతకంతకూ అడుగంటిపోతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలోని పలు ప్రాంతాల్లో ఇదే విపత్కర పరిస్థితి నెలకొని ఉంది. గత ఏడాది వర్షాకాలం ఆరంభంలో మొదలైన ఎల్‌నినో పుణ్యమాని వర్షాలు అంతంత మాత్రమే కురవడంతో భూగర్భ జలమట్టం పెరగలేదు. ఈ ఏడాది ఆరంభం నుంచి ఎండలు విజృంభిస్తున్న నేపథ్యంలో, వందల అడుగుకు భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లకు నీరు అందడం లేదు. పంటల మాట అటుంచి, రాబోయే రోజుల్లో తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా కరవయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితికి ఎల్‌నినో కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రత మార్పులతో ఏర్పడే ఎల్‌నినో కారణంగా వాతావరణంలోకి పెద్ద మొత్తంలో శక్తి విడుదలవుతుంది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో గత ఏడాది జూన్‌లో మొదలైంది. దీని ప్రభావం ఈ ఏడాది మే వరకూ కొనసాగుతుందని చెబుతున్నారు. వాతావరణంలోకి విడుదలవుతున్న గ్రీన్ హౌస్ వాయువుల కారణంగా భూతాపం రానురాను పెరుగుతోంది. ఒక అంచనా ప్రకారం 1901 నుంచి మన దేశంలో పెరుగుతున్న భూతాపం రేటు ప్రపంచ సగటు కన్నా ఎక్కువ. అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు సంపన్న దేశాలు సైతం బొగ్గు, చమురు, సహజ వాయువుల వినియోగంపై ఆధారపడుతూ వాతావరణ కాలుష్యాన్ని పెంచి పోషిస్తున్నాయి. కర్బన ఉద్గారాలను అధిక మోతాదులో విడుదల చేస్తున్న జాబితాలో చైనా, అమెరికా, భారత దేశం అగ్రస్థానాల్లో కొనసాగుతున్నాయి. భూతాపం పెరిగితే వ్యవసాయ దిగుబడులు తగ్గి, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. హిమనదాలు కరిగిపోవడం, సముద్రాలు పొంగడం, వరదలు సంభవించడం, వడగాలుల తీవ్రత పెరగడం వంటి ఉత్పాతాలు చోటు చేసుకుంటాయి. భూ ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీల సెల్సియస్ వద్ద నిలిపి ఉంచితేనే మానవాళి భద్రంగా ఉంటుందని ఎనిమిదేళ్ల క్రితమే పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. అయితే ఎల్‌నినో కారణంగా గత ఏడాది భూతాపం పెరుగుదల 1.4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని ప్రమాద ఘంటికలు మోగించింది. ఈ ఏడాది సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ దాటిపోవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిస్తోంది. ఈ ఎండా కాలంతో ఎల్‌నినో పరిసమాప్తమవుతుందనీ, ఆ తర్వాత లానినో పరిస్థితి ఏర్పడి, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న సూచనలు హర్షణీయమే. అయితే ముందున్న విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కడం ప్రధానం. మండిపోతున్న ఎండలకు ఇప్పటికిప్పుడు మందు వేయడం ప్రభుత్వాల చేతిలో లేని పని. ఈసారి ఎండలు అసాధారణంగా ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన కర్తవ్యం ప్రభుత్వానిదే. వడదెబ్బ తగిలి అమాయక జనం ప్రాణాలు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ వైద్యకేంద్రాల్లో వడదెబ్బ చికిత్సకు తగిన మందులు, పరికరాలను అందుబాటులో ఉంచాలి. తాగునీటి ఎద్దడి నెలకొనకుండా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ఆవశ్యకం. చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో సరిపెట్టుకోకుండా, ప్రజలు ఈ ఎండాకాలాన్ని సురక్షితంగా దాటడంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలూ తమ వంతు పాత్ర పోషించాలి.

# అధికారుల అవినీతిపై చర్య తీసుకోవాలి

## - సిపిఐ



ఆత్మకూర్, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): అమరచింత మున్సిపల్ చైర్మన్, అధికారుల అవినీతిపై విచారణ జరిపించి చట్టరీత్యా చర్య తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం అమరచింత తహసిల్దార్ కార్యాలయం వద్ద నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా. మున్సిపాలిటీకి 13,14,15 ఫైనాన్స్ నుంచి, టియుఐఎఫ్డిసి, ఎఫ్ఎఫ్సి తదితర పథకాల కింద రూ. 18 కోట్లు మంజూరు అయిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అడ్డగోలుగా నిధులు ఖర్చు చేశారన్నారు. ఫలితంగా అందులో తొమ్మిది కోట్ల అవినీతి జరిగిందన్నారు. అవినీతికి నిరసనగా చైర్మన్ పై ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారని, ఏప్రిల్ 4వ తేదీన ఓటింగ్ ఉందన్నారు. అవినీతిపై విచారించి బాధ్యులపై చర్య తీసుకునే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, బీడీ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, డిహెచ్పిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్, నాయకులుమల్లేష్ లక్ష్మీనారాయణ, నిస్సార్, ఇజ్రాయేల్, సౌలు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవికాలం దృష్ట్యా తల్లిదండ్రులకు పిల్లలపై తగు సూచనలు

## - ఆత్మకూర్ పోలీస్ శాఖ



ఆత్మకూర్, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం స్థానిక బస్టాండ్ లో వేసవి సెలవుల దృష్ట్యా తల్లిదండ్రులకు బుధవారం రోజు ఆత్మకూరు పోలీస్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలపై తీసుకోవాల్సిన తగు చర్యల గురించి తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల్ని బావులలో ఈతకు పంపించరాదనీ, స్నేహితులతో దూర ప్రయాణాలు వంటివి చేయనివ్వరాదని, పిల్లలకు బైకులు ఇవ్వరాదని, పిల్లల్ని ఎక్కువగా ఎండలో తెగనివ్వరాదని, వీలైనంతవరకు ఎండోర్ గేమ్స్ ఆడే ప్రయత్నం చేయాలి స్నేహితులతో కలిసి దూర ప్రయాణాలను మానుకోవాలి మొబైల్ ఫోన్ చేతికి ఇవ్వరాదు సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లలకు పై చెడు ప్రభావం పడి అవకాశం ఉన్నది తెలియని స్నేహితుల ఇంటికి పంపించరాదు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వాటర్ బాటిల్ లో మరియు గొడుగుని తీసుకెళ్లాలి పిల్లల చేతులు సెల్ఫోన్ ఉంటే ఆన్లైన్ గేమ్స్ ఆడే ప్రయత్నం చేస్తారు కాబట్టి తగు జాగ్రత్త వహించాలి సెల్ఫోన్లోకి వచ్చే ఓటేబుల్లను ఎవరికి చెప్పరాదు కాబట్టే వీలైనంతవరకు పిల్లలకు చేతికి ఫోన్ ఇచ్చే ప్రయత్నం చేయవద్దని తగు సూచనలు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బాలేశ్వర్ రెడ్డి, కానిస్టేబుల్స్ భీమన్న బాలరాజు, రాణి, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యంతోనే విజయం సాధ్యం

## - లక్ష్యసాధన తోనే విజయం సాధ్యం



నేరేడుచర్ల, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల శ్రీ అంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ అల్క సైదిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన 15 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థి కొలువుల రారాజు రమావత్ మధుసూదన్ ను పాఠశాలలో అభినందించిన సందర్భంగా మాట్లాడారు. ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండి పట్టుదల క్రమశిక్షణ కృషితో ఏదైనా సాధించవచ్చు అన్నారు. ప్రతి విద్యార్థి రమావత్ మధుసూధన్ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిర పడాలన్నారు. కొలువుల రారాజు రామావత్ మధుసూదన్ మాట్లాడుతూ పాఠశాలలో నేర్పిన క్రమశిక్షణ చదువు తాను ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించడానికి దోహదపడిందన్నారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు జానకి రాములు, జనార్ధన్, నాగ ప్రసాద్, యాకూబ్, ఆదినారాయణ, రాము, రవీందర్ రెడ్డి, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, నాగరాజు, నాగేంద్రబాబు, నాగలక్ష్మి, సత్య, సుజాత, అనిత, వీణ, కవిత, స్వప్న, నర్మదా, మాధవి, సంతు, శ్రీ సైదాబీ, అపర్ణ, వసంత, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ పూర్తి

## - జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జేండగే



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన 566 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్ల మెదటి ర్యాండమేజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనమంతు కే.జెండగే తెలిపారు. మంగళవారం నాడు కలెక్టరేటు వీడియా కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్లైన్ ద్వారా పారదర్శకంగా ఈవిఎం యంత్రాల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించబడింది. భువనగిరి అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని 257 పోలింగ్ కేంద్రాలకు గాను 25 శాతం అదనంగా 321 బ్యాలెట్ యూనిట్లు, 321 కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా 359



వివిప్యాట్లు కేటాయించబడినట్లు, ఆలేరు అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని 309 పోలింగ్ కేంద్రాలకు గాను 25 శాతం అదనంగా 386 బ్యాలెట్ యూనిట్లు, 386 కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా 432 వివిప్యాట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించబడినట్లు జిల్లా కలెక్టరు వివరించారు. ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, బహుజన సమాజ్ పార్టీ నుండి బట్టు రామచంద్రయ్య, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి కూర వెంకటేశ్, కె.గణేశ్, భారతీయ జనతా పార్టీ నుండి ఉడుత భాస్కర్, ఎన్.రాజు చారి, కలెక్టరేటు ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరచారి, జిల్లా ఇడిఎం. సాయికుమార్, డిప్యూటీ తహశీలుదారు సురేష్, శ్రీకాంత్, ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో పాత్రికేయుడు మృతి

## - కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి



దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో సుదీర్ఘకాలం సేవలందించిన సీనియర్ పాత్రికేయులు నక్క తిరుపతయ్య(48) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుది శ్వాసవిడిచారు. ఆయన మృతి పట్ల ఎంపీపీ పద్మావతమ్మ వెంకట్ నారాయణ, మండల పాత్రికేయులు రవికాంత్ జోషి, శ్రీనివాస్ రెడ్డి, తీన్మార్ రవికుమార్, విమల్ కుమార్, బాల్ రాజ్, సాయిలు యాదవ్, ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, విజయ్ లు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతయ్య భౌతిక కాయాన్ని వారు సందర్శించి పూలమాలతో ఘననివాళులు అర్పించారు. వారి హఠాన్మరణం పాత్రికేయులకు తీరనిలోటు వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తిరిగి రాని లోకాలకు చేరడం తట్టుకోలేకపోతున్నామని పలువురు పాత్రికేయులు వాపోయారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పాత్రికేయులుగా తిరుపతయ్య యాదవ్ వివిధ దినపత్రికల్లో పనిచేశారని ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# జానపాడు గ్రామీణ ప్రాంత వాసి షేక్ మనీషా కు డాక్టరేట్ ప్రధానం



పాలకవీడు, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, జానపహాడ్ గ్రామానికి చెందిన షేక్ పీర్ సాహెబ్ - సైదాబీల కుమార్తె షేక్ మనిషా ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కాలేజీలో 2018 బ్యాచ్ లో ఎంబిబిఎస్ పూర్తి చేసినది. కావున జిల్లా కలెక్టర్ మరియు కాలేజీ డైరెక్టర్ షేక్ మనిషా కి డాక్టర్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు గ్రామీణ ప్రాంతం నుంచి డాక్టర్ చదువులు చదువుకోవాలంటే ఎంతో ఖర్చులతో కూడిన పని అని, డాక్టర్ సర్టిఫికెట్ అందుకున్న తర్వాత ఆ కష్టాన్ని మర్చిపోయి సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతం నుండి ఒక అమ్మాయి డాక్టర్ కావటం వలన పలువురు ప్రశంశలు అందిస్తున్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య





రాజాపేట, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): రాజాపేటకు చెందిన రజక సంఘం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సట్టు తిరుమలేశ రజని ల కుమారుడు భరద్వాజ్ వివాహం మారుతి తో బుధవారం జనగామ లో జరిగిన ఈ వివాహ వేడుకలకు పలువురు ప్రముఖులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ సారయ్య, రాష్ట్ర మహిళా చైర్మన్ బండ్రు శోభారాణి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, రజక సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, కల్లురి రామచంద్రారెడ్డి, వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, ఆప్తులు, బంధువులు, కులస్తులు పాల్గొన్నారు.

# వివాహిత మహిళా అదృశ్యం



టేక్మాల్, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): మెదక్ జిల్లా, టేక్మాల్ మండలం, చల్లపల్లి గ్రామానికి చెందిన వివాహిత మహిళా కనిపించకుండా పోయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. టేక్మాల్ ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం చల్లపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మగడ్డ బాలమణి 26 మానసిక వికలాంగురాలు. తల్లి దండ్రుల వద్దనే ఉంటూ జీవనం సాగిస్తుంది. గత నెల 31తేదీ నాడు అమే తల్లి దండ్రులు ఉదయం పది గంటలకు వ్యవసాయ పనులకు వెళ్ళి సాయంత్రం ఆరు గంటలకు వచ్చేసరికి వారి కూతురు కనిపించలేదు. చుట్టు ప్రక్కల, బందువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. ఏళ్ళమ్మగడ్డ అంజయ్య తన కూతురు కనిపించడం లేదని గురువారం టేక్మాల్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆమె ఇంటి నుండి వెళ్ళినప్పుడు ఆకుపచ్చ రంగు లంగ జాకెట్ ధరించింది. 5”2 ఎత్తు గుండ్రని ముఖం చామనచాయ రంగు కలిగి ఉంటుంది.

# ప్రపంచ స్థాయి ఆర్ట్ కాంపిటీషన్లో ప్రథమ బహుమతి పొందిన జస్వంత్ కుమార్



పాలకవీడు, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ గ్రామానికి చెందిన ఉబ్బపల్లి సైదులు ఉబ్బపల్లి లత కుమారుడు జశ్వంత్ కుమార్ టీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ అండ్ జె ఆర్ సి (బాయ్స్) హుజూర్నగర్ లోని పాఠశాల లో ఆరవ తరగతి చదువుతున్న జస్వంత్ కుమార్ ఇటీవల జరిగిన ముంబై రంగు ఉత్సవ కాంపిషన్ సమస్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ స్థాయి ఆర్ట్ కాంపిటీషన్లో కలరింగ్ స్కెచ్ కార్టూను పోలాజ్ హ్యాండ్ రైటింగ్ గ్రీటింగ్ కార్డ్ కాంపిటీషన్లో ప్రథమ బహుమతి పొందాడు. ఈ సందర్భంగా ఉబ్బపల్లి జస్వంత్ కుమార్ ను పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సన్మానించి బహుమతిని అందజేశారు. జస్వంత్ కుమార్ మాట్లాడుతూ నేను జాతీయ నుంచి ప్రపంచం స్థాయిలో కాంపిటీషన్ కి సెలెక్ట్ అయ్యా అవార్డు రావడం నన్ను ఇంత ప్రోత్సహించిన మా టీచర్ నాగ జాను సూరేపల్లి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. నా తల్లిదండ్రులు కృతజ్ఞతలు చెబుతున్నాను ఇంకా ముందు ముందు ఆర్ట్ మంచి పేరు తెచ్చుకొని మా కుటుంబానికి గురువులకు స్కూలుకి పేరు తెస్తానని విర్నమించారు.

# విద్యార్థులకు సైబర్ సేఫ్టీ, సైబర్ అంబాసిడర్ గుర్తింపు


### - సర్టిఫికెట్లు అందజేసిన ఎస్ఐ సుధాకర్ రెడ్డి



రాజాపేట, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం, నెమిల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తత పై ఐదు రోజుల శిక్షణలో పాల్గొని సైబర్ అంబాసిడర్లుగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ మహిళా భద్రతా విభాగం పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక ఆన్లైన్ శిక్షణ ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నిక చేయబడిన పాఠశాల విద్యార్థులకు సైబర్ భద్రత నిపుణుడు రక్షిత్ టాండన్ మార్గదర్శకంలో ఆన్లైన్ శిక్షణ నెమిల విద్యార్థులకు ఇచ్చారు. సైబర్ నేరాల పట్ల అవగాహన తప్పించుకొను మార్గాలు మహిళలపై సైబర్ వేధింపులు నిరోధానికి ఆరు నుండి పది తరగతుల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వీటితోపాటు పాఠశాల ఉపాధ్యాయులను కూడా ఇందులో భాగ స్వామ్యులను చేసారు. నెమిల పాఠశాల నుండి శిక్షణ పొందిన మన్నె శ్రీవాణి, వేముల భవ్య శ్రీ, మర్రి శైలజ, పిడిశెట్టి చైతన్యలకు సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజాపేట ఎస్సై సుధాకర్ రెడ్డి ఏఎస్ఐ మైసయ్య విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పొందిన విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, మహిళలకు తెలియజేసి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి, ప్రసూనకుమారి, మల్లేష్, పిసి.వెంకటేష్, హెచ్జి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తా

### - ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాజరై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థిని,విద్యార్థుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలలో ఉన్న పెండింగ్ పనుల కోసం నియోజకవర్గంలోని అన్ని పాఠశాలకు 11 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు.

ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు మంచిగా చదువుకొని బంగారు భవిష్యత్తుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో చందంపేట మండల జెడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం నాయక్, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరజ్ ఖాన్, యువజన అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ సర్పంచ్ పున్నా వెంకటేష్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ నూతన జిల్లా అధ్యక్షులు

### - బక్షీ శ్రీధర్ రావు ను సన్మానించిన పెద్దమందడి జర్నలిస్టులు



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా టీయూడబ్ల్యూజే హెచ్-143 నూతన జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన బక్షి శ్రీధర్ రావును పెద్దమందడి జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. బుధవారం సీనియర్ జర్నలిస్ట్ మాజి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గోపి యూనియన్ మండల అధ్యక్షులు ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుని శాలువా, పూలమాలలతో పెద్దమందడి జర్నలిస్టులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రావు మాట్లాడుతూ జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డుతో పాటు, ఇళ్లస్థలాలు, జర్నలిస్టులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా జర్నలిస్టుల నూతన యూనియన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నరసింహారెడ్డి, బాజ శేఖర్, భానుప్రకాష్, జానీ, కృష్ణ, వెంకటేష్, బండిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి దొడ్డి కొమరయ్య సాగించిన పోరాటం అజరామమైనది

### - బీసీ నేత జూకంటి ప్రవీణ్ కుమార్
### - రాజాపేట లో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



రాజాపేట, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి దొడ్డి కొమరయ్య 97వ జయంతిని పురస్కరించుకొని బుధవారం రాజపేట మండల కేంద్రంలోని గాంధీ కూడలి వద్ద కురుమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, నైజాములకు, దేశ్ముకులకు, దొరలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో దొడ్డి కొమరయ్య చూపించిన తెగువ అజరామమైందన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో బహుజన సమాజం ముందుకు నడిచి సామాజిక న్యాయ సాధన కోసం బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కురుమ సంఘం అడాహక్ కమిటీ నేతలు వస్పరి సుధాకర్, గౌర బక్కయ్య, చీర మహిపాల్, రేగు సిద్ధులు, అఖిలపక్ష నేతలు నెమిల మహేందర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్రగోకుల జస్వంత్, చిగుళ్ల లింగం, కేదారి గౌడ్ కురుమ సంఘం నాయకులు, రేగు శ్రీశైలం, కాకళ్ల ఉపేందర్, బాల్ద శ్రీకాంత్, కాకళ్ల భరత్, కాకళ్ల ఉపేందర్, దయ్యాల శ్రీనివాస్, జన్నె సిద్ధులు, మాపుభాస్కర్, గుంటి యాదగిరి, నాకీర్త సిద్ధులు, గుంటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



# మాదిగల ద్రోహి రేవంత్ రెడ్డి

### - మాదిగలను అవమానించిన కాంగ్రెస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తాం
### - కొమ్ము చెన్నకేశవులు మహాజన్ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): పార్లమెంటు సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కొమ్ము చెన్నకేశవులు మహాజన్ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు, గంధం గట్టయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త, గంధం లక్ష్మయ్య మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ
ఎంఎస్పి రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందని, రేవంత్ రెడ్డి మాలలకు భయపడి తన ముఖ్యమంత్రి సీటును కాపాడుకోవడం కోసం మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని అన్నారు. దళితుల్లో 20% గళ్ళ మాలలకు రెండు సీట్లు కేటాయించి ఊరుకొక్కరు లేని బైండ్ల కులానికి ఒక సీటు ఇచ్చిన రేవంత్ రెడ్డి దళితుల్లో 75% గల మాదిగలకు ఒక్క సీటు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ లో ఐదు శాతం జనాభా కలిగిన తమ రెడ్డి కులానికి ఆరు సీట్లను కేటాయించుకున్న రేవంత్ రెడ్డి 12 శాతం జనాభా గల మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా ద్రోహం చేశాడని అన్నారు. మాదిగల మద్దతుతోనే నేను ఈ స్థాయికి ఎదిగిన అని, నా సొంత కులం నన్ను పట్టించుకోకపోయినా మాదిగలు మాత్రం నా ప్రతి ఎదుగుదలలో వెన్నంట ఉన్నరని అనేక వేదికల మీద మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మాదిగలకు అవకాశాలను ఇవ్వకుండా అవమాన పరుస్తూ నమ్మకద్రోహానికి పాల్పడ్డాడని అన్నారు.
మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నీటిని భూస్థాపితం చేశామని కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు.
వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలమంతా ఏకమవుతామని అన్నారు. ఒక్క సీటు కూడా కేటాయించని కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి వైఖరికి నిరసనగా పది రోజుల పాటు నిరసన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ములకలపల్లి పరశురాముడు మాదిగ ఎంఎస్ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గౌరీపాగ లక్ష్మయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ ఘనపూర్ మండల అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మాదిగ, గోపాల్పేట ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బండారి విష్ణు మాదిగ, ఎమ్మార్పీఎస్ విపనగండ్ల మండల కో కన్వీనర్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదం గల కారణాలు తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటాం

### - శివసేన రెడ్డి



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): అగ్ని ప్రమాదానికి గురైన వనపర్తి నియోజకవర్గం పెబ్బేరు పట్టణంలోని మార్కెట్ యార్డును మంత్రి జూపల్లి కృష్ణ రావు. ఎమ్మెల్యే వనపర్తి మేఘా రెడ్డి తో కలిసి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదం ఆకస్మికంగా సంభవించిందా ఎవరైనా కావాలని చేశారా అనే దానిపై పూర్తి విచారణ చేస్తున్నామని విచారణలో కారణాలు వెల్లడైన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పెట్రోల్ పంపులు డీలర్స్ అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి




వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెట్రోల్ పంపులు డీలర్స్ అధ్యక్షులుగా దాడి చంద్రశేఖర్ రెడ్డి సలహాదారులు గౌరవ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మయూరి బ్యాంకెట్ హాల్ లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా దాడి చంద్రశేఖర్ రెడ్డి(వనపర్తి), గౌరవ సలహాదారులు కల్వరాజు (ఆత్మకూరు), గౌరవ అధ్యక్షులు బుచ్చయ్యశెట్టి (కనిమెట్ట), ఉపాధ్యక్షులుగా మహేశ్వర్ రెడ్డి, సురేష్ లను ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్ ను, కార్యదర్శిలుగా జగదీష్, ప్రియ సింహ, కోశాధికారిగా రమణ (వనపర్తి) లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దాడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సంఘాన్ని బలోపేతం చేయడం పెట్రోల్ డీజిల్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. రాష్ట్ర కమిటీ ద్వారా సమిష్టిగా కలిసి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో జమీల్, నరేందర్ రెడ్డి, బిసిరెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, సతీష్, రంజిత్, రామకృష్ణ, కృష్ణారెడ్డి, సూర్య కమల్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

### - చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జేండగే



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ శ్రీ హనుమంతు కె. జెండగే తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేసారు.
ఈ సందర్భంగా వారు వడదెబ్బ నివారణ భాగంగా గ్రామ స్థాయిలో పనిచేసే ఆశా, ఆరోగ్య సిబ్బందికి ఎంతవరకు అవగాహణ కలిగించారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఆశా కార్యకర్త వద్ద 100 ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, ఏఎన్ఎం వద్ద 300 ప్యాకేట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 500 ప్యాకెట్లు స్టాక్ ఉండేలా చూడాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఇంకా స్టాక్



అవసరముంటే జిల్లా స్టోరుకు ఇండెంటు పెట్టి తెప్పించుకోవాలన్నారు. ఓఆర్ఎస్ పాకెట్లు అందరికీ కాకుండా డీహైడ్రేషన్ లక్షణలు ఉన్నవారికి మాత్రమే ఇవ్వాలన్నారు. ప్రజలు బయటకు వెళ్ళే ప్రదేశాలు, ఉపాధి హామీ పనుల ప్రదేశాలలో జిల్లా టీముల సహాయంతో ఎక్కువ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలనని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.పాపారావు, ప్రోగ్రాం అధికారి డా.సుమన్ కళ్యాన్, ఎంపిడిఓ. రాజ్యలక్ష్మి, డాక్టర్లు సుదీర్ రెడ్డి, రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.



# చామల కిరణ్ కుమార్ రెడ్డి విజయానికి కృషిచేయాలి

**- ఇటికాల చిరంజీవి**



అడ్డగూడూరు, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజయానికి కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజీవి అన్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానికుడైన చామల కిరణ్ కుమార్ రెడ్డి విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి నాలుగు లక్షల పైచిలుకు మెజార్టీతో గెలిపించాలని కోరారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేనప్పుడు ఎన్నో ఉద్యమాలలో పోలీసుల చేతులు లాటి దెబ్బలు తిన్న ఉద్యమకారుడు, నేడు కాంగ్రెస్ పార్టీ వారిని గుర్తించి వారికి భువనగిరి పార్లమెంట్ టికెట్ కేటాయించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దగ్గర అనుచరులుగా ముద్ర వేసుకొని కోమటిరెడ్డి బ్రదర్స్ అండదండలతో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించి రాహుల్ గాంధీ సోనియా జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించి సోనియా గాంధీ రాహుల్ గాంధీకి బహుమతిగా ఇవ్వాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరినీ కోరారు.

# దొడ్డి కొమురయ్య స్పూర్తితో తెలంగాణ ఉద్యమం

**- సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్**



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య స్పూర్తితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ప్రారంభమైందని సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ అన్నారు. బుధవారం భువనగిరి అమరవీరుల సంస్మరణ స్థూపం వద్ద నిర్వహించిన దొడ్డి కొమురయ్య 97 వ జయంతి సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి నిజాం నవాబు ఏర్పాటు చేసుకున్న రాజాకార్ ప్రైవేటు సైన్యం, దొరలు, జామీందారుల ఆగడాలకు వ్యతిరేకంగా చేపట్టిన శాంతియుత రైతాంగ పోరాట ఉద్యమంలో దొడ్డి కొమురయ్య పై రజాకార్లు కాల్పులు జరిపి ఆయన ప్రాణాలు బలిగొన్నారని ఆయన తెలిపారు. ఆ తరువాత తెలంగాణలో గుప్తల సంఘం, సాయుధ పోరాట సంఘాలు ఏర్పడి



తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేసి రజాకార్ల నుండి విముక్తి కల్గించారని ఆయన తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కూడా శాంతియుతంగా జరుగుతున్న సమయంలో కాసోజు శ్రీకాంత్ చారి మరణంతో తీవ్ర రూపం దాల్చిందని ఆయన అన్నారు. తొలి అమరుల స్పూర్తితో ప్రజలు పోరాటాలు చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నారని ఆయన అన్నారు. నేటి యువత తొలి అమరులైన దొడ్డి కొమురయ్య, కాసోజు శ్రీకాంత్ చారిల జీవిత చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేసి, భవిష్యత్తు తరాలకు అందించటానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి ఆనంద్ యాదవ్, యాదవ సంఘం జిల్లా నాయకులు వేల్పుల మల్లయ్య యాదవ్, గుండెబోయిన వీరేష్ యాదవ్, పర్వతం కృష్ణ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, బద్దుల అశోక్ యాదవ్, శ్రీరాం శరత్ యాదవ్, రాసాల రణధీర్ యాదవ్, మాదరబోయిన నరేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్ కందుల విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు వేసవిలో నీటిని పొదుపుగా వాడాలి

దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా దంతనూర్ గ్రామంలో త్రాగునీటి ఇబ్బందులను పరిశీంచిన మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్సీ కార్పొరేషన్ ఇడి మల్లిఖార్జున్ దంతనూర్ గ్రామంలో పర్యటించి త్రాగునీటి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు వేసవికాలంలో ఎండల తీవ్రత వల్ల త్రాగునీటి కొరత ఏర్పడితే వ్యవసాయ బోర్లు రైతుల నుండి లీజ్ కు తీసుకొని త్రాగు నీటి కొరతను నివారించాలని గ్రామ ప్రజలు ఈ వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. త్రాగునీటి నల్లాలకు ఆన్, ఆఫ్ లు బిగించుకోవలని కోరారు. వారి వెంట ఎంపిఓ పుష్ప, పంచాయతీ సెక్రెటరీ విక్రం గౌడ్, అర్ డబ్ల్యూ ఎస్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివా నందు, పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ చీర్ల శ్రీనివాసులు, ప్రవీణ్



కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దూది వెంకటాపురం బీరప్ప కామరాతి దేవి కళ్యాణోత్సవానికి ఆహ్వానం

రాజాపేట, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలం దూది వెంకటాపురం కురుమ సంఘం తరఫున వసుపరి సుధాకర్ శ్రీ బీరప్ప కామరాతి దేవి కళ్యాణ మహోత్సవానికీ రావలసిందిగా పలువురి పెద్దలకు బుధవారం ఆహ్వాన పత్రికలు రాజాపేటలో అందజేశారు. బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేమిల మహేందర్ గౌడ్, చీర మహిపాల్, రేగు సిద్ధులు, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ మండల అధ్యక్షులు ఎండి యూసుఫ్ లను సాదరంగా ఆహ్వానించారు.



# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



ఆత్మకూర్, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, మూలమల్ల గ్రామానికి చెందిన మీసాల లక్ష్మన్న అనారోగ్య కారణంగా బుధవారం రోజు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మూలమల్ల గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మీసాల లక్ష్మన్న పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు అంత్యక్రియల నిమిత్తం 23 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

# ఆర్థిక సహాయం అందజేత



రామన్నపేట, ఏప్రిల్ 03(తీన్మార్ న్యూస్): రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలో తలారి స్వామి అనారోగ్యంతో మరణించారు. వారి భౌతికకాయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రూ.10000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. వీరి వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పున్న వెంకటేశం, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు ఎడ్ల నరేందర్ రెడ్డి, పిట్ట మహేందర్ రెడ్డి, నకిరేకంటి ఎల్లయ్య, జినుక శాంతి శేఖర్, కర్రె రమేష్, పినికేసి గోపాల్ రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, కంతాల నర్సిరెడ్డి, పాశంసతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అతివేగంతో బైక్‌ను ఢీకొట్టిన లారీ

**- ఇద్దరు పదో తరగతి విద్యార్థుల మృతి**

**- మొన్ననే పరీక్షలు పూర్తి.. ఇంతలోనే ప్రమాదం**

**- జహీరాబాద్‌లో ఘటన**



జహీరాబాద్: అతివేగంతో వచ్చిన ఓ లారీ బైక్‌ను ఢకొట్టడంతో ఇద్దరు పదో తరగతి విద్యార్థులు మృతి చెందారు. మొన్నటి వరకు పరీక్షలు రాసిన వారిద్దరూ.. పరీక్షలు పూర్తయిన రెండ్రోజులకే ప్రమాదంలో మరణించడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం జరిగింది. జహీరాబాద్ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మోమిన్ మహిలకు చెందిన వరుసకు అన్నదమ్ములయ్యే యువకులు.. రిహాన్(18), ఆదిల్(16).. మంగళవారం ఉదయం తమ మామకు సంబంధించిన యమహా బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీఏ చెక్‌పోస్ట్ నుంచి అతివేగంగా వస్తున్న లారీ ఆ యువకులు ప్రయాణిస్తున్న బైక్‌ను రైల్వే ఓవర్ బ్రిడ్జి బాగా రెడ్డి విగ్రహం వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. రిహాన్‌కు స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి..

మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఒకే కుటుంబానికి చెందిన వరుసకు అన్నదమ్ములయ్యే ఇద్దరు యువకులు మృతి చెందడంతో.. పట్టణంలోని మైనార్టీ సోదరులు, మృతుల సహచర విద్యార్థులు భారీ సంఖ్యలో ఆస్పత్రికి వచ్చి బోరున విలపించారు. దాంతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంలా మారింది. కాగా మృతదేహాలను స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించి.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, విషయం తెలుసుకున్న డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ప్రధానంగా ఆర్టీఏ చెక్‌పోస్ట్ నుంచి వస్తున్న వాహనాలు, రాంనగర్ వైపు దారి మళ్లిస్తున్న వాహనాలు కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనా స్థలాన్ని ఇదివరకే రోడ్డు ప్రమాదాల సంఘటనా స్థలంగా గుర్తించినట్టు చెప్పారు. బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసిన అనంతరం ప్రమాదాలు కొంచెం తగ్గినట్టు తగ్గి.. మళ్ళీ ప్రారంభం అయ్యాయన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయితే వాహనాల రద్దీ ఇంకా పెరుగుతుందని, కాబట్టి ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఒక నివేదికను తయారు చేయనున్నట్టు చెప్పారు. ప్రాణాలు చాలా అమూల్యమైనవి, రెండు నిమిషాలు ఆలస్యమైనా.. జాగ్రత్తగా నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు చేయాలని సూచించారు. ఆయన వెంట సీఐ రవి, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు. రోడ్డు ప్రమాదాలకు నిలయంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి..రైల్వే ఓవర్ బ్రిడ్జి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్టీఏ చెక్‌పోస్ట్ నుంచి వస్తున్న వాహనదారులకు.. ఈ ఓవర్ బ్రిడ్జి వద్ద క్రాసింగ్ చేస్తున్న వాహనాలు.. దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలోని వివిధ వార్డులతోపాటు శివాజీ విగ్రహం నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు ద్విచక్ర వాహనాలపై జాతీయ రహదారిపైకి వెళ్తుంటారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించండి

**- ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి : సీఈవో వికాస్‌రాజ్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి**

హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలు కల్పించి, ఎన్నికలు సజావుగా సాగటానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఎన్నికల కమిషన్ (ఈసీ)ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి 800 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలనీ, లేదంటే 800 మంది ఓటర్లు దాటిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కూ ఒక అదనపు పోలింగ్ అధికారిని కేటాయించాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి ఆహారం, కనీస సౌకర్యాలు కల్పించడానికి కఠినమైన ఆదేశాలను జారీ చేయాలని తెలిపారు. గత ఎన్నికల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లోని పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు ఏకరూప వేతనం చెల్లించాలని సూచించారు. గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొన్ని నియోజకవర్గాల్లో రూ.2,400 అంతకంటే ఎక్కువ చెల్లించగా, కొన్నింటిలో



రూ.1,600 చెల్లించారని గుర్తు చేశారు. దీంతో ఉద్యోగుల్లో తీవ్ర అశాంతి నెలకొందని తెలిపారు. వచ్చేనెల 13న రిసెప్షన్ సెంటర్ నుంచి పోలింగ్ సిబ్బందికి వారి నివాస స్థలాలకు రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నవారు, శారీరక వైకల్యం ఉన్న వారు, ఏడాదిలోపు ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయించాలనీ, జిల్లా ఎన్నికల అధికారుల (డీఈవో)కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అర్హత కలిగిన పోలింగ్ సిబ్బంది అందరికీ తుది శిక్షణా తరగతి రోజే పోస్టల్ బ్యాలెట్ అందజేసి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలిగించాలని సూచించారు. ఈ అంశాలను పరిశీలించి, డీఈవోలకు అవసరమైన సూచనలను జారీ చేయాలని తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ హార్డ్‌డిస్కులు ధ్వంసం

**- నాగోల్ మూసీలో కంప్యూటర్ల పరికరాల ముక్కలు రికవరీ**

**- ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే.. ఫోన్‌ట్యాపింగ్ చేశామన్న భుజంగరావు, తిరుపతన్న**

**- వారిద్దరి కస్టడీ పూర్తి.. 6 వరకు రిమాండ్**

**- రాధాకిషన్‌రావు కస్టడీపై నేడు న్యాయమూర్తి నిర్ణయం**

**- మరో అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావుకు నోటీసులివ్వనున్న స్పెషల్ టీం**




రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న ఉప ఎన్నికల సమయంలో ప్రభాకర్‌రావు ఇచ్చిన విపక్షాలకు సంబంధించిన ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసినట్టు అంగీకరించారు. ఈ మారు బీఆర్ఎస్ ప్రభుత్వమే తిరిగి వస్తుందనుకున్నామనీ, కానీ రాకపోవటంతో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు గతేడాది డిసెంబర్ 4న ఫోన్‌ట్యాపింగ్‌కు ఉపయోగించిన కంప్యూటర్ల హార్డ్‌డిస్కలను ముక్కలు చేసి, వాటిని నాగోల్ వద్ద మూసీ నదిలో పడేశామని భుజంగరావు, తిరుపతన్న ఒప్పుకున్నారు.

ఈ మేరకు నాగోల్ మూసీ నది ఒడ్డు నుంచి ఐదు కంప్యూటర్ హార్డ్ డిస్క్ కవర్లను, ఆరు హార్డ్‌డిస్క్ ముక్కలను తాము స్వాధీనపర్చుకున్నట్టు రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారులు వివరించారు. అలాగే, ఎస్ఐబీలోని ప్రణీత్‌రావు ఏర్పర్చుకున్న లాగ్‌రూంలో ధ్వంసం చేసిన కంప్యూటర్ అవశేషాలను ఆ పరిసరాల్లోనే సగం కాలిన డాక్యుమెంట్లను ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించినవి తాము స్వాధీనపర్చుకున్నట్టు కూడా ఇందులో పేర్కొన్నారు. విపక్షాలకు చెందిన ఫోన్ నెంబర్లేగాక పలువురు ప్రయివేటు వ్యాపారులు, ప్రముఖ వ్యక్తుల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు కూడా నరేశ్ అనే ఎస్ఐబీ కానిస్టేబుల్‌ను విచారించగా బయటపెట్టినట్టు ఈ రిపోర్ట్‌లో వివరించారు. తనతో పాటు మరికొందరు కానిస్టేబుళ్లు పైఅధికారుల ఆదేశాల మేరకు ఫోన్‌ట్యాపింగ్ స్పెషల్ టీంలో పని చేసినట్టు నరేశ్ తెలిపాడు. అలాగే, ఈ టీంలో వరంగల్ రేంజ్‌కు చెందిన మరొక అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావు కూడా పాల్గొని ఫోన్‌ట్యాపింగ్‌ల వ్యవహారాన్ని ముందుకు నడిపించాడని భుజంగరావు, తిరుపతన్న అధికారులకు వివరించారు. దీంతో, వేణుగోపాల్‌రావుతో పాటు మరికొందరు అధికారులకు విచారణకు హాజరుకావాలని కోరుతూ 41 సీఆర్పీసీ కింద దర్యాప్తు అధికారులు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ కోసం మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును తమ కస్టడీకి ఇవ్వాలంటూ దర్యాప్తు అధికారులు పెట్టుకున్న పిటిషన్‌పై న్యాయమూర్తి తన తీర్పును బుధవారానికి వాయిదా వేశారు. మొత్తమ్మీద, ఒకవైపు పోలీసు అధికారుల నేరాన్ని ఈ కేసులో నిరూపించటానికి అవసరమైన ఆధారాలను సేకరిస్తున్న స్పెషల్ టీం అధికారులు..

మరోవైపు, ఫోన్‌ట్యాపింగ్‌లకు ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించిన అప్పటి బీఆర్ఎస్ నాయకులకు సంబంధించిన కూపీని జాగ్రత్తగా లాగుతున్నట్టు తెలిసింది. రాజకీయ ప్రముఖులపై తాము చేతులు వేసే ముందు దానికి తగ్గ ఆధారాలను పక్కాగా సేకరించి అడుగు వేయాలని ప్రస్తుత పొలిటికల్ బాస్‌ల నుంచి దర్యాప్తు అధికారులకు ఆదేశాలున్నట్టు తెలిసింది. ప్రధానంగా, ప్రభాకర్‌రావును అదుపులోకి తీసుకొని విచారించాకే.. అప్పటి రాజకీయ ప్రముఖుల పాత్ర గురించి ఒక అంచనాకుదర్యాప్తు అధికారులు వచ్చే అవకాశమున్నదని తెలిసింది.

# హైదరాబాద్ లో భారీగా పట్టుబడ్డ నగదు




హైదరాబాద్: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల వేళ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎక్కడికక్కడ సోదాలు చేపడుతూ అక్రమ నగదు రవాణాకు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా మంగళవారం నాడు హైదరాబాద్?లోని దారుస్సలాం ఔట్?పోస్ట్ వద్ద భారీగా నగదు పట్టుబడింది. మంగళ్?హాట్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ. 1.50 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కొత్త రవిచంద్ర, సురేశ్, శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోక్ తీసుకున్నామని పోలీసులు తెలిపారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు చెప్పారు. మరోవైపు సార్వత్రిక ఎన్నికల వేళ బ్యాంకుల్లో అనుమానాస్పద లావాదేవీలపై నిఘా పెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనుమానం వచ్చిన బ్యాంక్ అకౌంట్?లపై పోలీసులు పోలీసులు నిఘా పెంచారు.

# యువతరాన్ని ప్రోత్సహించడానికే వంశీకి టికెట్


## – రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



మల్హర్ రావు: యువతరాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గడ్డం వంశీకి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ ఇచ్చిందని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి లోక్ సభ ఇన్చార్జ్ గా ఉన్న మంత్రి శ్రీధర్ బాబు బుధవారం గడ్డం వంశీకి మద్దతుగా.. పెద్దపల్లి సెగ్మెంట్ పరిధిలోని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావులతో ప్రెస్ మీట్ నిర్వహించి దుద్దిళ్ల మాట్లాడారు కాకా వెంకటస్వామి మనవడిగా గడ్డం వంశీకి గుర్తింపు ఉందని.. తన ట్రస్ట్ ద్వారా వంశీ అనేక సేవా కార్యక్రమాలుచేస్తున్నారని చెప్పారు. ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో గడ్డం వంశీకృష్ణ రాజకీయాల్లోకి వస్తున్నారని తెలిపారు. వంశీకృష్ణను గెలిపించడానికి తామంతా కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. వంశీకృష్ణను ప్రజలంతా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

# హైకోర్టులో ఎన్నికల లబ్ధికి యత్నిస్తే ఎలా?

## కాళేశ్వరం అవినీతిపై పిల్స్ విచారణ



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ లోక్‌సభ ఎన్నికల ప్రచారం తరహాలో వాదనలు వినిపిస్తే ఎలాగని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ఎన్నికల వేళ రాజకీయ వాదనలు వినిపించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. విచారణలో ఎన్నికలు ప్రసంగాలు చేయడానికి అనుమతించే ప్రసక్తే లేదంది. ప్రభుత్వ వాదనలు విన్న తర్వాతే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామనీ, ఇప్పటికిప్పుడే వాదనలు విని ఉత్తర్వులు జారీ చేయాలంటే వీలు కాదని స్పష్టం చేసింది. అవినీతి జరిగిందని మీడియా కథనాలను ఆధారంగా పిల్స్ వేయడం కాదనీ, అవినీతి జరిగిందని చెప్పడానికి పిటిషనర్లు ఎలాంటి ఆధారాలు చూపుతున్నారో చెప్పాలని కోరింది. అధ్యయనం, పరిశీలన చేయకుండా మీడియా కథనాల ఆధారంగా పిల్స్ వేసే ఎలాగని ప్రశ్నించింది. ఇవి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలా లేక ప్రచార వ్యాజ్యాలా? అని వ్యాఖ్య చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కే.ఏ.పాల్, బి.రామ్మోహన్‌రెడ్డి. వ్యక్తిగత హొదాలో, ప్రొఫెసర్ కోదండరామ్ రెడ్డి, ముదుగంటి విశ్వనాథరెడ్డి, బక్కా జడ్సన్ విడివిడిగా వేసిన పిల్స్‌ను మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టిన సందర్భంగా పైవిధంగా ప్రశ్నలు వేసింది. సీఐబీ దర్యాప్తు అంశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 8కి వాయిదా వేస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి ఆలోక్ ఆరాధే, జస్టిస్ జె.అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. విచారణ సందర్భంగా పిల్స్ వేసిన పిటిషనర్లను ఉద్దేశించి కీలక ప్రశ్నలు వేసింది. ముడుపులు చేతులు మారాయని ఎలా తెలుసనీ, అక్రమాలు జరిగాయని ఎలా చెబుతున్నారనీ, అవినీతి జరిగిందని చెప్పడానికి ఆధారాలు ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. 2016లో ప్రాజెక్టు ప్రారంభిస్తే ఇప్పటి వరకు ఏం చేశారనీ, అవినీతిపై అధ్యయనం చేశారా లేక పరిశోధన చేశారా? అని కూడా ప్రశ్నించింది. మీడియాలో వచ్చిన కథనాలు మినహా ఆధారాలు ఏమున్నాయనీ, అవినీతిపై ఏ అధికారికి ఫిర్యాదు చేశారనీ, ఆ అధికారి ఏం చర్యలు తీసుకున్నారో కూడా వివరించాలని కోరింది. కాళేశ్వరంపై గత ఉత్తర్వుల జారీని పరిశీలించకుండా ఇప్పటికిప్పుడే విచారణ చేయాలంటే ఎలాగని ప్రశ్నించింది. ఈ రోజే విచారణ పూర్తి చేసి తప్పు చేసిన అక్రమార్కులను జైళ్లకు పంపాలా, ప్రభుత్వ వాదనలు వినకుండానే ఉత్తర్వులు జారీకి అవకాశం లేదని తెలియదా? అని కూడా ప్రశ్నించింది.

పిల్స్‌ను విడివిడిగా విచారణ చేపట్టాలని, పాల్ వేసిన పిల్‌ను విడిగా విచారణ చేయాలంటూ బక్క జడ్సన్ లాయర్ ఎస్. శరత్ కోరడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. ఇదే మీ వైఖరి అయితే తిరస్కరిస్తూ ఆర్డర్ ఇస్తామని చెప్పింది. ప్రొఫెసర్ కోదండరాం లాయర్ వాయిదా వేయాలని కోరుతున్నారనీ, ఒకే అంశంపై వేర్వేరుగా విచారణ చేయబోమని స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ముందే తాము పిల్ వేశామనీ, అయితే నెంబర్ కేటాయింపు ఆలస్యమైందని విశ్వనాథరెడ్డి లాయర్ నందిత చెప్పడంపై హైకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది. రాజకీయ ప్రయోజనాలతో దాఖలు చేస్తారా? అని నిలదీసింది. పిటిషన్ మొదటిసారి విచారణకు రాగానే న్యాయవాది హాజరు కాలేదని గుర్తు చేసింది. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే అంశంపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని అదనపు ఏజీ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్‌ను ఆదేశించింది. విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది.

# కూలీలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మల్హర్ రావు: జాబ్ కార్డున్న ప్రతి కూలీ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధిహామీ పథకం మండల ఏపీఓ గిరి హరీష్ సూచించారు. బుధవారం మండలంలోని మల్లారం గ్రామపంచాయితీ పరిధిలో చెరువు పూడికతీత పనులు పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై కూలీలకు అవగాహన కల్పించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 100 రోజుల పాటు ఉపాధిహామీ కూలి పనులు ప్రతి ఒక్కరికి నూతనంగా లభించడం జరుగుతుందన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే ఈ ఆర్థిక సంవత్సరం, కూలీలకు ఉపాధి వేతనం రూ. 272 నుండి రూ. 300 వరకు అనగా రూ. 28 పెరగడం జరిగిందన్నారు. ఉపాధి కూలీలు ఈ అవకాశాన్ని వినియోగించుకొనీ,ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధిహామీ కూలి పనులకు వెళ్లాలని కూలీలకు ఏపీఓ అవగాహన కల్పించారు.ప్రతి ఉపాది కూలి వంద రోజులు పని చేస్తే రోజుకు రూ. 300 చొప్పున రూ. 30,000 వెలు పొందవచ్చున్నారు

ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత,మేట్స్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# వ్యక్తిగత విషయాలు తమ వద్దకు తీసుకురావద్దు: ఆది శ్రీనివాస్



చందుర్తి: దండం పెట్టి చెపుతున్న గెట్ల పంచాయతీ,వ్యక్తి గత విషయాలు తమ వద్ద కు తీసుకురావద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గ్రామాల్లో ఎక్కువ పనికి రాని పంచాయతీ లి ఉంటాయి.వ్యవసాయ భూములు గెట్ల పంచాయతీలు ఉంటాయి వాటిని తమకు అంటి పెట్టవద్దని చెప్పకనే చెప్పిండు.అలాంటివి తమవద్దకు తెచ్చి పార్టీ ప్రతిష్ట తీయవద్దని హితవు పలికారు.మంగళవారం ఆశిరెడ్డి పల్లి,తిమ్మాపూర్, రామన్న పేట గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలను.ఉద్దేశించి ప్రసంగించారు.

## నేను లోకల్..

నేను లోకల్ అంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆశిరెడ్డి పల్లి, తిమ్మాపూర్,రామన్నపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన గెలువుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఎలక్షన్. సమయం.లో.ఎదుటి వారు ఎంత డబ్బు ఖర్చు పెట్టిన ప్రజలు నన్ను లోకల్ వ్యక్తి గా గుర్తించి ఓట్లు వేసి తన విజయానికి కృషి చేశారని పేర్కొన్నారు.తన పదవిలో లేకున్నా పదవిలో ఉన్న లోకాల్ గా ఉంటూ జనం సమస్యల్లో పాలు పంచు కుంటున్నానని పేర్కొన్నారు. అదేవిదంగా 120 గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని అన్నారు.ఇప్పటికే పలు గ్రామాలకు నిధులు ఇవ్వడం జరిగిందని సూచించారు.

మతి స్థిమితం లేని అబ్బాయిని ఆదుకుంటాం..!

ఆశిరెడ్డి పల్లి.గ్రామానికి చెందిన జంగ.సాగర్, స్వరూప కుమారుడు సాయి తేజ పుట్టిన నుండి ఇప్పటి వరకు మతి స్థిమితం లేకుండ గా తమ.ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.అదేవిదంగా ఎల్లం పల్లి ప్రాజెక్ట్ కాలువ నిర్మాణం లో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితుల కు అప్పటి ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణం కొరకు ప్రత్యేకంగా నిధులు.ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఇవ్వలేదని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎలక్షన్ కోడ్ ఉన్నందున ఏమిచేయలేము తర్వాత చూద్దాం అన్నారు.

# పంటలు ఎండనివ్వం.. ప్రతి గింజా కొంటాం

## – 'పంటల బీమా'కు క్యాబినెట్ ఆమోదం
## – ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు నెరవేరుస్తాం
## – కేసీఆర్‌వి వేల అబద్ధాలు..
## – అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ఇల్లందు: గతంలో పంట బీమా ఇన్సూరెన్స్ పథకం ఉండేదని మళ్ళీ ఈ పథకాన్ని పునర్ ప్రవేశపెట్టడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిం దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబా బాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందు, పినపాక, డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, భద్రాచలం ఎంఎల్‌ఏలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, రామచంద్ర నాయక్, దొంతి మాధవరెడ్డి, మురళీనాయక్, తెల్లం వెంకటరావు, పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇన్సూరెన్స్ పథకం ద్వారా వైపరీత్యాలు వచ్చిన సందర్భాల్లో పరిహారాలు అందుతాయన్నారు. ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేస్తుందన్నారు. పంటలు ఎండిపోకుండా బోర్లు ఇతర మార్గాల ద్వారా నీరందించడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రబీ సీజన్‌లో ప్రతి గింజా కొంటామన్నారు. రాష్ట్రంలో 7,145 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు 92.36 శాతం రైతు బంధు బ్యాంక్ అకౌంట్‌లో జమైందని తెలిపారు. మిగతావి త్వరలో జమకానున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల తొలి బహిరంగ సభ హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఈనెల 6న భారీ ఎత్తున జరగనుందని తెలిపారు. రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణంలో జరిగే సభలోనే జాతీయ స్థాయి ఎన్నికల మ్యానిఫెస్టో ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ఈ సభకు ముఖ్యతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, జాతీయ నాయకులు రాహుల్, ప్రియాంక గాంధీ రానున్నారని తెలిపారు. కేసీఆర్‌వి అబద్ధాలు మాజీ సీఎం కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలేనని మంత్రి తుమ్మల అన్నారు. ఇప్పటికీ అబద్ధాలు చెప్పుకుంటూ ప్రజలను మభ్యపెట్టడం వల్ల ఆయన స్థాయి తగ్గించుకున్నారన్నారు. ఉన్న గౌరవాన్ని నిలుపుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని 9 ఏండ్లు పాలించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయకుండా భ్రష్టుపట్టించారని విమర్శించారు. విద్యుత్, నీటిపారుదల ప్రాజెక్టులు, ఆర్థిక వనరులు అన్ని నాశనం చేశారని తెలిపారు. వర్షాకాలంలో నీరివ్వనోళ్ళు మండుతున్న ఎండకాలంలో నీళ్ళేవి అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలే అయినప్పటికీ వారు చేసిన తప్పులన్నీ తమపై రుద్దాలని చూస్తున్నారని ఇది తగదని అన్నారు. వారి పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని, తాము అధికారంలో ఉన్నా ఎన్ని ఇబ్బందులు ఏర్పడినా ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తామని స్పష్టంచేశారు.

# గోస వినేదెవరు..?

## – సమస్యల్ని పట్టించుకునే నాథుడేడి?
## – కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర ఆరోపణలు, వ్యక్తిగత దూషణలకే పరిమితం
## – విమర్శల్లో కానరాని సహేతుకత
## – మతం, సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడం పైనే బీజేపీ గురి



హైదరాబాద్: అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ మధ్య నెలకొన్న వైరం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. చేసిన పనులు, చేస్తున్న పనులు, చేయాల్సిన పనుల గురించి కాకుండా వ్యక్తిగత విమర్శలకు ఆ రెండు పార్టీల నేతలు పదును పెడుతున్నారు. బీఆర్ఎస, కాంగ్రెస్ లీడర్ల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. సూటిపోటి మాటలు, ఘాటైన విమర్శల నేపథ్యంలో ఉద్వేగ భరితమైన వాతావరణం నెలకొంది. కొందరైతే ఏకంగా బూతుపురాణం అందుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పీసీసీ అధ్యక్షులు కూడా అయిన సీఎం రేవంత్ రెడ్డిలు ఒకరి పై ఒకరు మాటలతో దాడి చేసుకుంటున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అని వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. రెండు పార్టీలకు చెందిన ప్రధాన నాయకులే పదునైన పరుష పదజాలాన్ని వాడుతుండటంతో ఎమ్మెల్యేలు సైతం వారినే అనుసరిస్తున్నారు. రానున్న కాషాయ ప్రమాదాన్ని పక్కన పెట్టి ఇరు పార్టీలు దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. తెలంగాణ ఏర్పడి పదేండ్లు గడుస్తున్నప్పటికీ విభజన హామీలు పూర్తిగా అమలు కాలేదు. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాలు, ప్రాజెక్టులకు జాతీయ హొదా, వివిధ పథకాల కేటాయింపులకు కేంద్రం మొండి చేయి చూపించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధుల వరదను పారిస్తున్న మోడీ సర్కార్ ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల వివక్షతను ప్రదర్శిసోంది. వీటిని జన బాహుళ్యంలోకి తీసుకెళ్లడంలో ఇరు పార్టీలు ఘోర వైఫల్యం చెందాయి. పార్లమెంట్ ఎన్నికలు లౌకిక, ప్రజాస్వామికవాదులకు పెను సవాల్ విసరనున్నాయి. గతం కంటే ఎక్కువ ఓటింగ్ శాతంతో పాటు సీట్లను సాధించాలనే పట్టుదలతో బీజేపీ పావులు కదుపుతోంది.

# ఆర్టీసీలో తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

## – సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



హైదరాబాద్: గత ప్రభుత్వ కాలంలో దీర్ఘకాలికంగా ఆర్టీసీలో పనిచేసి స్వల్పకారణాలతో తొలగించబడిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు వంటి వివిధ శాఖలలో పనిచేస్తున్న సిబ్బందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 1,500 పైగా చిన్నచిన్న ఉద్యోగులను స్వల్పకారణాలతో విధుల నుంచి తొలగించడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించిన ఆర్టీసీ కార్మికులందరూ సుమారు ఐదు నుంచి 20 ఏండ్లపాటు నిరంతరంగా సంస్థ కోసం సేవలందించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో బస్సుల కండిషన్‌లు, టికెట్ల మిషన్‌లు వంటి వాటిని సరైన రీతిలో నిర్వహించకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ఈ తప్పిందాలకు చిన్నచిన్న ఉద్యోగులను బాధ్యులుగా చేయడం విచారకరమని పేర్కొన్నారు. ఆర్టీసీలో భర్తీ చేయాల్సిన పోస్టులున్నాయనీ, వాటిలో ఈ తొలగించబడిన ఉద్యోగులను భర్తీచేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

# సిద్దిపేటలో బీఆర్ఎస్ కు షాక్

## – సీఎం సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన సిద్దిపేట బిఆర్ఎస్ కౌన్సిలర్లు

సిద్దిపేట: సిద్దిపేటకు చెందిన 7వ వార్డ్ కౌన్సిలర్ ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి, 20వ వార్డు కౌన్సిలర్ రియాజుద్దీన్, 37 వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మి ఆనంద్ లు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మంత్రి కొండా సురేఖ పార్టీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మొదటిసారిగా సిద్దిపేట పట్టణానికి చెందిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తమతో ఆప్యాయంగా మాట్లాడుతూ, ఎప్పుడైనా, ఏ అవసరమైన తనను నేరుగా కలవచ్చని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు బెయిల్

**- ఆయన స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనొచ్చు**
**- లిక్కర్ కేసుపై వ్యాఖ్యలు చేయొద్దని షరతు**
**- ఆరు నెలల తరువాత తీహార్ జైలు నుంచి బయటకు**



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేత, ఎంపీ సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. ఇదే కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు తరలించిన 24 గంటల్లోనే ఈ పరిణామం చోటు చేసుకుంది. అయితే ట్రయల్ కోర్టు ఇచ్చిన షరతులు అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. ఎంపీ సంజయ్ సింగ్ రాజకీయ సభలు, సమావేశాల్లో పాల్గొనవచ్చని, లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని పేర్కొంది. అలాగే ఈడీ అరెస్ట్, రిమాండ్‌కు సంబంధించి సంజయ్ సింగ్ దాఖలు చేసిన రెండో పిటిషన్‌ను కొట్టివేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో సహ నిందితుడు (అప్రూవర్‌గా మారిన) దినేశ్ అరోరా, ఎంపీ సంజరు సింగ్‌కు రూ. 2 కోట్లు ఇచ్చినట్టు ఈడీకి స్టేట్మెంట్ ఇచ్చారు. ఈ స్టేట్మెంట్ ఆధారంగా గతేడాది అక్టోబర్ 4న ఎంపీ సంజయ్ సింగ్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ తరువాత ఆయనను అరెస్ట్ చేసింది. అనంతరం ఈడీ కస్టడీ ముగిసిన తరువాత జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా సంజరు సింగ్‌ను తీహార్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో తన అరెస్ట్, రిమాండ్‌ను సవాల్ చేస్తూ, బెయిల్ పిటిషన్‌పై రెండు వేరు వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సంజయ్ దాఖలు చేసిన పిటిషన్లను గతేడాది డిసెంబర్ 22న ట్రయల్ కోర్టు, ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఢిల్లీ హైకోర్టులు తిరస్కరించగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ ప్రసన్న బి వరలేలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈడీ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, సంజయ్ సింగ్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీలు వాదనలు వినిపించారు.

**ఈడీది ప్రతీకార చర్య: సింఘ్వీ**

లిక్కర్ స్కాంలో సంజరు సింగ్‌పై ఈడీ చేస్తోన్న ఆరోపణలు మొత్తం అప్రూవర్‌గా మారిన దినేశ్ అరోరా స్టేట్మెంట్‌తో ముడిపడి ఉన్నాయని సింఘ్వీ కోర్టుకు నివేదించారు. అరోరా ముందు ఇచ్చిన 9 వాంగ్మూలాలలో సంజయ్ సింగ్ పేరు లేదని, తరువాత ఆయన పేరు చేర్చినట్లు చెప్పారు. అనంతరం ఈడి 'నో అబ్జక్షన్' స్టేట్మెంట్‌తో అప్రూవర్‌గా మారిన దినేశ్ అరోరాకు బెయిల్ వచ్చిందని వాదించారు. అయితే సెక్షన్ 50 ప్రకారం అరోరా స్టేట్మెంట్ పై తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ సంజయ్ సింగ్ అరెస్ట్ జరిగిన రోజు నిర్వహించిన ప్రెస్ మీట్ తరువాత, ఈడీ ప్రతీకార చర్యను ప్రారంభించిందని ఆరోపించారు. ఆ వెంటనే దర్యాప్తు ఏజెన్సీ అధికారులు సంజయ్ సింగ్ నివాసానికి వెళ్లారని వివరించారు.

సంజయ్ సింగ్ అరెస్ట్ ఆవశ్యకత, ఆధారాలు లేని ఆరోరా స్టేట్మెంట్స్, సింగ్‌కు సంబంధంలేని అంశాలను ప్రస్తావించారు. అందువల్ల న్యాయాన్ని అపహాస్యం చేసే ఈ విధానాలను నిలిపివేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ అంశాలతో ఏకీభవించిన ధర్మాసనం, సంజరు సింగ్ నుంచి ఎలాంటి డబ్బు రికవరీ కానందున తదుపరి కస్టడీ అవసరమా? లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని ఎఎస్జీ ఎస్వీ రాజును ధర్మాసనం కోరింది. ఎలాంటి సూచనలు లేకుంటే మెరిట్ పై వాదనలు కొనసాగించాలని స్పష్టం చేసింది. లంచ్ బ్రేక్ తరువాత ఎస్వీ రాజు ఈడీ అభిప్రాయాలను కోర్టుకు నివేదించారు. ఈడీ కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని తెలిపారు. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం%ో% మెరిట్స్ సంజరు సింగ్‌కు అనుకూలంగా ఉంటే బెయిల్ ఇవ్వవచ్చని కోర్టుకు నివేదించారు. అయితే నిందితుడు నేరానికి పాల్పడలేదని నమ్మడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయని, బెయిల్ పై ఉన్న సమయంలో నిందితుడు ఎలాంటి నేరం చేసే అవకాశం లేదని కోర్టు సంతప్తి చెందితేనే, పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం నిందితుడిని కోర్టు విడుదల చేసే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని జస్టిస్ ఖన్నా స్పష్టం చేశారు.

ఈరోజు కోసం ఎదురుచూపు : సంజయ్ సింగ్ తల్లి రాధికా సింగ్

మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేత సంజయ్ సింగ్‌కు బెయిల్ మంజూరు కావడంపై ఆయన తల్లి రాధికా సింగ్ స్పందించారు. కోర్టు నిర్ణయంతో తాము సంతోషంగా ఉన్నామని, దీని కోసం తాము ఎప్పటినుంచో వేచి చూస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని, తన కుమారుడు అమాయకుడని, ఆయనను అరెస్ట్ చేయకూడదని, అయినా తనకు బెయిల్ రావడంతో తాము సంతోషంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇక సంజరు సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ స్వాగతించింది. సత్యం గెలిచిందని ఆప్ జాతీయ ప్రతినిధి ప్రియాంక కక్కర్ పేర్కొన్నారు. తాము మొదటి నుంచి ఇదే చెబుతున్నామని, ఈ కేసు మొత్తం బూటకమని, బీజేపీ కార్యాలయంలో ఈ కేసుపై కట్టుకథ అల్లారని ఆమె విమర్శించారు. మరో 500 సార్లు దాడులు చేసినా ఒక్క పైసా కూడా స్వాధీనం చేసుకోలేరని స్పష్టం చేశారు. విచారణలో డబ్బు పట్టుబడనప్పుడు ఆయనను ఎందుకు కస్టడీలో ఉంచాలని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించిందని ప్రియాంక కక్కర్ పేర్కొన్నారు.

# విదేశీయులపై హత్యాయత్నం గీత దాటడమే

**- అమెరికా రాయబారి ఎరిక్ వ్యాఖ్య**

న్యూఢిల్లీ : ఒక దేశానికి చెందిన పౌరుడిని హత్య చేసేందుకు మరో దేశానికి చెందిన ప్రభుత్వం లేదా దాని అధికారులు ప్రయత్నించడం గీత దాటడమే అవుతుందని, ఆ పని సరికాదని భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేస్తున్న ఎరిక్ గార్సెట్టీ వ్యాఖ్యానించారు. అమెరికాలో సిక్కు వేర్పాటు వాది గుర్‌పత్‌వంత్ సింగ్ పన్నున్‌ను హత్య చేసేందుకు జరిగిన కుట్రను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఎరిక్ ఆదివారం ఎఎన్ఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ ఈ అంశం సార్వభౌమత్వానికి, హక్కులకు సంబంధించిందని చెప్పారు. గీత దాటడం అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. పన్నున్ ఉగ్రవాది అని భారత్ చెబుతున్నప్పుడు ఆయనను అమెరికా ఎందుకు రక్షిస్తోందని ప్రశ్నించగా భావ ప్రకటనా స్వేచ్ఛ రెండు దేశాలలో వేర్వేరుగా పనిచేస్తుందని ఎరిక్ తెలిపారు. పన్నున్‌ను తామేమీ వెనకేసుకురావడం లేదని అన్నారు. అయితే ఆయనపై మోపిన ఆరోపణలు అక్కడి చట్టాల ప్రకారం నిరూపితం కావాల్సి ఉన్నదని చెప్పారు. కాగా ఎరిక్ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ అది అమెరికా అభిప్రాయమై ఉంటుందని అన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకూ తమ వద్ద ఉన్న సమాచారం ఆధారంగా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ విచారణలో భారత భద్రతా ప్రయోజనాలు కూడా ఇమిడ ఉన్నాయని తెలిపారు.

# ప్రజలను తప్పుదారి పట్టించే యత్నమే!

**- న్యాయవాదుల లేఖపై ఐలూ విమర్శ**

న్యూఢిల్లీ : న్యాయ వ్యవస్థను పరిరక్షించాలం టూ ఇటీవల కొంతమంది న్యాయవాదుల బృందం ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాయడమంటే ప్రజలను తప్పుదారి పట్టించే యత్నమేనని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) ఒక ప్రకటనలో పేర్కొంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వె, అదిష్ అగర్వాల్ కూడా లేఖ రాసిన బృందంలో వున్నారు. అవినీతిని ఎండగడుతూ ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రత్యక్ష ప్రభావమే ఈ లేఖ అని ఐలూ పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల పరిరక్షణ కోసం, భారత రాజ్యాంగం మౌలిక వ్యవస్థను పరిరక్షించేందుకు నిరంతరంగా పోరాడుతున్న బాధ్యాతాయుతమైన న్యాయవాదులు, న్యాయవాదు ల సంఘాలకు వ్యతిరేకంగా నిరాధార ఆరోపణల తో రాసిన లేఖ మాత్రమేనని ఐలూ నేతలు, సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపి వికాస్ రంజన్ భట్టాచార్య, సీనియర్ న్యాయవాది పి.వి.సురేంద్ర నాథ్ విమర్శించారు. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యంతో పాటు రాజ్యాంగ మౌలిక వ్యవస్థపై కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యక్ష దాడి చేసినప్పుడు గతంలో ఈ న్యాయవాదుల బృందం మౌనంగా వుందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఆధిక్యత పేరుతో బాధ్యాతాయుతమైన పదవుల్లో వున్నవారు న్యాయ సమీక్షపై, మౌలిక వ్యవస్థపై దాడి చేశారని వారు పేర్కొన్నారు. న్యాయమూర్తుల ఎంపికలో కార్యనిర్వాహక వర్గం పాత్ర ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

# దశాబ్దకాలంలో దిగజారారు..

**- కార్మికుల నిజ వేతనాల దుస్థితి**
**- ఐఎల్‌వో, ఐహెచ్‌డీ సంయుక్త నివేదిక**

న్యూఢిల్లీ : దశాబ్దకాలంలో సాధారణ జీతం పొందే కార్మికుల నెలవారీ నిజ వేతనాలు ప్రతి ఏడాది ఒక శాతం మేర తగ్గుతున్నాయి. 2022 వరకు ఇదే పరిస్థితి కొనసాగినట్లు ఓ సర్వే తెలిపింది. నాణ్యమైన ఉపాధి అవకాశాలు లేకపోవడం, మహమ్మారి ప్రతికూల ప్రభావంతో ఈ పరిస్థితి ఏర్పడినట్టు ఆ సర్వే వెల్లడించింది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌వో), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డీ)లు సంయుక్తం గా ఈ నివేదికను రూపొందించాయి.

సాధారణ వేతన కార్మికుని సగటు నెలవారీ నిజ వేతనం 2012లో రూ.12,100గా ఉండగా, 2022 నాటికి రూ.10,925కి పడిపోయింది. ప్రభుత్వం నుండి సేకరించిన అధికారిక సమాచారాన్ని విశ్లేషించి ఐఎల్‌వో ఈ నివేదికను రూపొందించింది.

గత నెలలో విడుదల చేసిన ఇండియా ఎంప్లారుమెంట్ రిపోర్ట్ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో కన్నా పట్టణ ప్రాంతాల్లో నిజ వేతనాలు వేగంగా పడిపోయాయని, 2012లో రూ.13,616గా ఉండగా 2022లో రూ.12,616కి పడిపోయాయి. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో రూ.8,623 నుంచి రూ.8,966కి పెరిగాయి.

సాధారణ వేతనం లేదా జీతం పొందే కార్మికులు అంటే ఎక్కువ కాలం కొనసాగే కార్మికులు. వీరికి నెలవారీ లేదా వారానికి జీతాలు లేదా వేతనాలు చెల్లించవచ్చు. ఈ కేటగిరీ కింద ఆశావర్కర్లు, ఇంటి పనివారు, గార్డ్స్, ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేసే కార్మికులు ఉంటారు.

ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ కార్మికులలో చాలా తక్కువ నిష్పత్తిలో ఉన్నారని, వారి జీతాలు పెరిగినప్పటికీ వారి నిజ వేతనాలలో స్తబ్దతను ఎదుర్కొంటున్నది మాత్రం అధికంగా ప్రైవేట్ రంగ ఉద్యోగులేనని ఐహెచ్‌డీ డైరెక్టర్ అలఖ్ ఎన్ శర్మ తెలిపారు. మూడేండ్లను ప్రామాణికంగా తీసుకుని సాధారణ వేతనం (దీర్ఘకాలం కార్మికులుగా కొనసాగే వారు పొందే వేతనం), రోజువారీ కూలీ, స్వయం ఉపాధి పొందే కార్మికుల వేతనాలను వివరించారు. ఈ సమాచారాన్ని ద్రవ్యోల్బణాన్ని అనుసరించి సవరించారు.

సాధారణ వేతనం 2012లో నెలవారీ సగటు వేతనం రూ.12,100గా ఉండగా, 2019 నాటికి రూ.11,155కి పడిపోయింది. 2022 నాటికి రూ. 10,925కి తగ్గాయి. వార్షిక వద్ధి రేటు (సీఏజీఆర్) మైనస్ 1కి క్షీణించింది.

అదే సమయంలో రోజువారీ కూలీల నెలవారీ సగటు వేతనాల పట్టికను పరిశీలిస్తే.. 2012లో రూ.3,701 ఉండగా, 2019లో రూ.4,464కి చేరగా, 2022 నాటికి రూ.4,712కి చేరింది. వార్షిక వద్ధి రేటు (సీఏజీఆర్) 2 శాతానికి చేరింది.

స్వయం ఉపాధి కార్మికులను పరిశీలిస్తే 2012లో వివరాలు అందుబాటులో లేవు. 2019లో రూ.7,017కి ఉండగా, 2022 నాటికి రూ.6,843కి క్షీణించింది.

గార్డ్స్, ఇంటిపనివారు వంటి తక్కువ నైపుణ్యం కలిగిన సాధారణ కార్మికులకు వారి యజమానులు దామాషా ప్రకారం వేతనాలను పెంచకపోవడంతో వారి నిజ వేతనంలో స్తబ్దతను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరో అంశం ఏమిటంటే పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రయివేట్ రంగంలో వద్ధి కార్మికులకు వేతనాలను అందించలేదు. దీనిలో యజమానులు లాభపడినట్లు సమాచారం.

నివేదికను అనుసరించి సాధారణ కార్మికుల్లో సుమారు 39 శాతం మంది 2022లో నిజవేతనం రూ.5,001 నుంచి రూ.10,000 వరకు పొందారు. సుమారు 23 శాతం మంది రూ.2,001 నుంచి రూ.5,000 వరకు పొందారు. కేవలం 14.9 శాతం మంది మాత్రమే 2012లో 17.1 శాతం నుంచి 2022లో రూ.20,000కు పైగా వేతనాన్ని పొందారు. స్వయం ఉపాధి కింద ఉపాధి హామీ (ఎన్ఆర్ఈజీఏ) కార్మికులు సహా వత్తి నిపుణులు (ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు), పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. కోవిడ్ మహమ్మారి వీరిని కోలుకోలేనంతగా దెబ్బతీసింది. పట్టణప్రాంతాల్లో లాక్‌డౌన్‌తో వత్తి నిపుణుల ఆదాయం తీవ్రంగా ప్రభావం చూపిందని అలఖ్ ఎన్ శర్మ వివరించారు.



# యోగా బాబా ఒప్పుకున్నాడు


**- తప్పుడు ప్రకటనలిచ్చామని వెల్లడి**
**- క్షమించమని వేడుకోలు**
**- ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు**
**- కేంద్ర ప్రభుత్వంపైనా విమర్శలు**



న్యూఢిల్లీ : ప్రముఖ కార్పొరేట్ వ్యాపారస్తుడు, యోగా గురువు తన తప్పుడు ప్రకటనలపై సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. చేసిన తప్పులను మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు అంగీకరించారు. పతంజలి ఆయుర్వేద కో-ఫౌండర్ బాబా రాందేవ్, ఆ కంపెనీ సీఈవో ఆచార్య బాలకృష్ణను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. పతంజలి తప్పుదోవ పట్టించే ప్రకటనలపై కేంద్రం కూడా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకుందని న్యాయమూర్తులు హిమాకోహ్లీ, అసనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. బాబా రాందేవ్ గతంలో.. ' కోవిడ్-19 వ్యాక్సిన్ వేసుకున్న కొందరు మరణిస్తున్నారు. అల్లోపతి వైద్య విధానం 100 శాతం పనిచేయలేదనడానికి ఇదే నిదర్శనం ' అంటూ చేసిన వ్యాఖ్యలపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) గతేడాది సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీం పలుమార్లు విచారణ జరిపింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**- బీజాపూర్ అడవుల్లో ఎదురుకాల్పులు**
**- మహిళతో సహా పదిమంది మావోయిస్టులు మృతి**



చర్ల: బీజాపూర్ దండకారణ్యం కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని లెంద్రా గ్రామం అడవిలో ఉదయం 06:00 గంటల నుంచి పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతిచెందినట్టు తెలుస్తోంది. డీఆర్జీ ఎస్టీఎఫ్ కోబ్రా, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో బీజాపూర్‌లోని గంగలూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులను గమనించిన మావోయిస్టులు వారిపైకి కాల్పులు జరపగా, ఆత్మరక్షణ కోసం పోలీసులూ కాల్పులు జరిపారు. అనంతరం సంఘటనా స్థలంలో ఒక మహిళా మావోయిస్టుతో సహా మొత్తం 10 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. హతమైన మావోయిస్టుల్లో ఎక్కువ మంది పీఎల్‌జీఏ కంపెనీ రెండో నెంబర్‌కు చెందిన వారిని పోలీసులు ధ్రువీకరించారు. వారిలో ఇద్దరు.. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఘటనల్లో నిందితురాలుగా ఉండి రూ.29 లక్షలు రివార్డ్ గల డీవీసీఎం సజంతి అలియాస్ క్రాంతి, 14 లక్షల రివార్డుతో మావోయిస్టు రఘు అలియాస్ షేర్ సింగ్ ఏసీఎంగా గుర్తించారు. అలాగే ఘటనాస్థలంలో ఒక ఎల్ఎంజీ ఆటోమేటిక్ ఆయుధం, 303 రైఫిల్, 12 బోర్ రైఫిల్స్, పెద్ద మొత్తంలో బీజీఎల్ సెల్స్, లాంచర్లు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రోజువారీ ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ వెల్లడించారు. బస్తర్ ప్రాంతంలోని బీజపూర్‌లో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉంటాయి. ఈ ఏడాది బస్తర్ ప్రాంతంలో ఇప్పటి వరకూ జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 41 మంది మావోయిస్టులు హతమయ్యారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాజా ఎన్‌కౌంటర్ జరిగింది. బస్తర్ లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న తొలి దశలోనే పోలింగ్ జరగనుంది. గత నెల నుండే మావోయిస్టులు తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. సాధారణంగా మార్చి-జూన్ మధ్యకాలంలో భద్రతాదళాలపై ఎక్కువ దాడులు జరుగుతుంటాయి. గత నెలలో బీజపూర్‌లోని బసగుడా ప్రాంతంలో భద్రతాదళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు.

# బట్టల షాప్ లో ఘోర అగ్నిప్రమాదం..

## ఒకే కుటుంబంలో ఏడుగురు మృతి




హైదరాబాద్: మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లాలోని ఓ వస్త్ర దుకాణంలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందారు. బుధవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఓ మహిళ ఉన్నట్టు సమాచారం. మిగతావారి ఆచూకీ లభించాల్సి ఉంది. శవపరీక్షల నిమిత్తం మృతదేహాలను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కంటోన్మెంట్? ప్రాంతంలోని జైన దేవాలయం సమీపంలో ఉన్న ఓ మూడంతస్తుల భవనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న సంబంధిత శాఖల అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు. మాకు సహాయంగా స్థానికులు కూడా ఓ చేయి కలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నాం. విచారణ జరుగుతోంది. దర్యాప్తులో అగ్నిప్రమాదానికి గల కారణమేమిటో తెలుస్తుందని స్థానిక పోలీసులు తెలిపారు.

# సమస్యలను పరిష్కరించండి

**మంత్రి దామోదరకు జూడాల వినతి**

హైదరాబాద్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఫిబ్రవరికి సంబంధించిన ఉపకారవేతనాన్ని వెంటనే విడుదల చేయడానికి మంత్రి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా సమస్యలపై దామోదర రాజనర్సింహతో సమగ్రంగా చర్చించినట్టు చెప్పారు.

# కీలక యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం

కీలక యాక్షన్ షెడ్యూల్ ప్రారంభంచిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి సరసన త్రిష కృష్ణన్ కథానాయిక. ఇటీవలే కొన్ని టాకీ పార్ట్‌లు, ఒక పాట, ఒక యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించి షెడ్యూల్‌ను ముగించిన మేకర్స్, హైదరాబాద్‌లో కీలకమైన యాక్షన్ షెడ్యూల్‌ను ప్రారంభించారు. ఫైట్ మాస్టర్స్ ద్వయం రామ్-లక్ష్మణ్ పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని అల్లుమియం ఫ్యాక్టరీలో చిరంజీవి, కొంతమంది ఫైటర్స్‌పై ప్రస్తుతం హై-ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. యాక్షన్ సీక్వెన్స్‌ను గ్రాండ్ స్కేల్‌లో రూపొందిస్తున్నారు. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ రిచ్ ప్రొడక్షన్, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో అద్భుతంగా ఉండబోతోంది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా



జనవరి10న ఈ సినిమా విడుదల కానుంది.

# అలాంటి ఫ్యామిలీ స్టార్స్ కోసం..

అలాంటి ఫ్యామిలీ స్టార్స్ కోసం..హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా మరో నాలుగు రోజుల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, 'ఈ సినిమా విషయంలో ప్రతి అంశం పాజిటివ్‌గా కనిపిస్తోంది. పాటలు, ట్రైలర్ మీరు చూశారు మీ అందరికీ నచ్చింది. అందుకే మీలోనూ ఆ హ్యాపీనెస్ కనిపిస్తోంది. పరశురామ్ ఈ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎగ్జైట్ చేసింది. విజరు, పరశు రామ్ కలిసి 'గీత గోవిందం' లాంటి బ్లాక్ బస్టర్ చేశారు. ఈ సినిమా కూడా వాళ్ల కాంబినేషన్‌లో సక్సెస్ అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఫ్యామిలీ స్టార్‌కు విజరు క్యారెక్టరైజేషన్ వెన్నెముక లాంటిది. విజరు నవ్విస్తాడు, ఏడిపిస్తాడు, ఫైట్ చేస్తాడు, ఫ్యామిలీ కోసం ఆలోచిస్తాడు, అమ్మాయిని ప్రేమిస్తాడు, ఆమెను ద్వేషిస్తాడు, రొమాన్స్ చేస్తాడు..ఇలా అన్ని షేడ్స్ హీరో క్యారెక్టర్‌లో ఉన్నాయి. ఇది కేవలం ఫ్యామిలీ స్టోరీ మాత్రమే కాదు లవ్ స్టోరీ కూడా ఉంటుంది' అని తెలిపారు.

"సీతారామం' సినిమాకు వర్క్ చేస్తున్నప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో నాకు ఇంత గొప్ప కెరీర్ ఉంటుందని అనుకోలేదు. ఆ సినిమా తర్వాత 'హారు నాన్న' వంటి మంచి స్క్రిప్ట్ దొరికింది. ఈ రెండు సినిమాల తర్వాత నేను చేసే సినిమాలు స్పెషల్‌గా ఉండాలని అనుకున్నా. అలాంటి స్పెషల్ స్క్రిప్ట్‌ను పరశురామ్ నెరేట్ చేశారు. గోవర్ధన్, ఇందూ, బామ్మ ఇతర క్యారెక్టర్స్ మధ్య బ్యూటిఫుల్‌గా స్టోరీ ఉంటుంది. మన జీవితం అర చేతిలాంటిది. మన వేళ్లలాగే జీవితంలో కూడా ఎత్తుపల్లాలు ఉంటాయి. కొన్నిసార్లు మన ప్రొఫెషనల్ లైఫ్ చాలా బాగుంటుంది, కానీ పర్సనల్ లైఫ్‌లో సమస్యలు ఉంటాయి. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అఛీవ్ మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో మీరు రిలేట్ చేసుకుంటారు. మనల్ని ఎంకరేజ్ చేసి ముందుకు నడిపించేవారు కుటుంబంలో ఎవరో ఒకరు తప్పకుండా ఉంటారు.



అలాంటి వారిని గుర్తుచేసుకునే ప్రయత్నమే ఈ సినిమా. ఈ సినిమా సైన్ చేసినప్పుడు నేను మా నాన్నతో ఈ సినిమా నీకోసమే చేస్తున్నానని చెప్పా. దర్శకుడు పరశురామ్ ఇందు క్యారెక్టర్‌ను చెప్పినప్పుడు నేను పోషించగలనా లేదా అని భయపడ్డాను. కానీ విజరు ఎంతో సపోర్ట్ చేశాడు' అని కథానాయిక మృణాల్ ఠాకూర్ చెప్పారు.

'మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని ధైర్యం చెప్పే పర్సన్ ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. మా కుటుంబంలో మా నాన్న ఫ్యామిలీ స్టార్. డైరెక్టర్ పరశురామ్ ఈ కథ చెప్పినప్పుడు ఆయన లైఫ్ లోని అనుభవాలను ఊహించు కుంటూ చెప్పాడు. కథ వింటున్నప్పుడు మాత్రం నాకు మా నాన్న గుర్తొచ్చాడు. ఫ్యామిలీ కోసం ఆయన పడిన తపన గుర్తుకువచ్చింది. అందుకే ఈ సినిమాలో హీరో క్యారెక్టర్‌కు గోవర్ధన్ అనే పేరు పెట్టమని చెప్పాను. ఎందుకంటే ఆ పేరు పెట్టుకున్న తర్వాత ఎమోషన్స్ పలికించడం సులువు అవుతుంది. ఈనెల 5న ఫ్యామిలీ స్టార్ రిలీజ్ అవుతోంది. 8న నాన్న బర్త్ డే. ఈ సినిమా విషయంలో ఆయన గర్వపడతారని ఆశిస్తున్నా'.

# వైవిధ్యమైన ప్రేమకథ

వైవిధ్యమైన ప్రేమకథనవదీప్ కొంత విరామం తరువాత హీరోగా, సరికొత్తగా నవదీప్ గా 2.0గా కనిపించబోతున్న చిత్రం 'లవ్ మౌళి'. విభిన్నమైన ఈ చిత్రానికి అవనీంద్ర దర్శకుడు. ఈ చిత్రాన్ని నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి నిర్మాణ పనులకు, టాలీవుడ్ టాలెంటెడ్ టెక్నీషియన్స్‌కి అడ్డాగా మారిన సి స్పేస్ బాధ్యతలు తీసుకుంది.

తాజాగా ఈ చిత్రాన్ని ఈనెల 19న విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో చాలా డిఫరెంట్‌గా నవదీప్ కనిపించడంతో ఈ సినిమా నవదీప్ 2.0గా అభిమానులంతా ఒక ఢిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఉంటుందని మంచి అంచనాలతో ఈ సినిమా గురించి ఎదురుచూస్తున్నారు. లేటెస్ట్‌గా విడుదలైన పాటలను చూస్తుంటే వీరి అంచనాలను మరింత పెంచే విధంగా ఉంది. నా లైఫ్‌లో జరిగిన ప్రేమకథలకు ఫలితమే ఈ సినిమా కథ. నేను పాన్ ఇండియా లెవల్‌లో ప్రేమించేవాడ్ని. ప్రేమ అనే టాపిక్‌లో సో మెనీ వేరియేషన్స్ ఉన్నాయి. నా స్వీయ అనుభవాలే ఈ సినిమా కథ. ఈ నెల 19న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. విభిన్న ప్రేమకథలు కోరుకునే ప్రేక్షకులందరికి మా లవ్, మౌళి మనసులకు



హత్తుకుంటుంది' అని అన్నారు. నవదీప్, పంఖురి గిద్వానీ, భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన -దర్శకత్వం- సినిమాటోగ్రఫీ -ఎడిటింగ్ : అవనీంద్ర, సంగీత దర్శకులు: గోవింద్ వసంత, పాటల రచన : అనంత శ్రీరామ్, ఆర్ట్ : కిరణ్ మామిడ.

# ప్రముఖ రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత

ప్రముఖ రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూతప్రముఖ సినీ రచయిత శ్రీరామకృష్ణ (74) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లాలోని తెనాలి. తమిళంలో అగ్రదర్శకులైన మణిరత్నం, శంకర్ తెరకెక్కించిన చాలా సినిమాలకు తెలుగులో శ్రీ రామకృష్ణ మాటలు అందించారు. రజనీకాంత్, కమల్‌హాసన్ వంటి అగ్ర కథానాయకులు నటించిన చిత్రాలతో పాటు దాదాపు 300చిత్రాలకుపైగా ఆయన తెలుగులో సంభాషణలను సమకూర్చారు. సూటిగా సుత్తిలేకుండా ఉండే ఆయన సంభాషణల ఫలితమే తమిళ సినిమాలు సైతం తెలుగులో అనువాదమై తెలుగు ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి. దీంతో ఆయా సినిమాలు తమిళంలోనే కాకుండా తమిళ:లోనూ సంచలన విజయాలు



సాధించాయి. చివరిగా ఆయన రజనీకాంత్ నటించిన 'దర్బార్' చిత్రానికి డైలాగ్స్ రాశారు.

# సరికొత్త అనుభూతినిచ్చే సినిమా

సరికొత్త అనుభూతినిచ్చే సినిమాసూర్య తేజ హీరోగా పరిచయం అవుతూ నటించిన చిత్రం 'భరతనాట్యం'. 'దొరసాని' ఫేమ్ కెవిఆర్ మహేంద్ర దర్శకత్వం వహించారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. వేసవి కానుకగా ఈనెల 5న ఈ సినిమా విడుదలకానున్న నేపథ్యంలో నిర్మాత పాయల్ సరాఫ్ మీడియాతో ముచ్చటించారు. 'నాకు చిన్నప్పటి నుంచే గ్లామర్ ఇండిస్ట్రీలో ఏదైనా చేయాలనే ఆసక్తి ఉండేది. అయితే నిర్మాత అవుతానని అనుకోలేదు. అనుకోకుండా ఇలాంటి మంచి అవకాశం వచ్చింది. చాలా మంచి కథ.

ఇలాంటి మంచి కథతో నిర్మాతగా మారాలని నిర్ణయించుకున్నాను. పిఆర్ ఫిలింస్ బ్యానర్ పై మా మొదటి సినిమాగా 'భరతనాట్యం' నిర్మించాం. ఇందులో చాలా మంది అద్భుతమైన నటీనటులు ఉన్నారు. వైవా హర్ష, హర్ష వర్ధన్, అజరు ఘోష్, సలీమ్ ఫేకు .. వీళ్ళంతా గత చిత్రాలకు భిన్నమైన పాత్రలలో కనిపిస్తారు. ఇది నాకు చాలా నచ్చింది. ఇందులో కంటెంట్, క్యారెక్టర్స్ రొటీన్‌కి భిన్నంగా ఉంటాయి. దర్శకుడు కావాలని ప్రయయత్నించే ఓ కుర్రాడు.. ఆర్థికంగా ఫ్యామిలీ, లవ్ లైఫ్ నుంచి సమస్యలు ఎదుర్కొంటూ అనుకోకుండా క్రైమ్ వరల్డ్‌లో పడి, అక్కడి నుంచి ఎలా బయటపడ్డాడనేది లైను. దర్శకుడు మహేంద్ర అమేజింగ్ పర్సన్. ఆయన ఈ సినిమా కోసం



వందశాతం ఎఫెర్ట్ పెట్టారు. సినిమాని అద్భుతంగా తీశారు. నా మొదటి సినిమాకి మహేంద్ర లాంటి దర్శకుడు దొరకడం నా అదృష్టం. కథ రాస్తున్నప్పుడే

ఈ సినిమాకి మహేంద్ర దర్శకుడిగా అయితే బావుంటుందని సూర్య అనుకున్నారు. నిజానికి ఇది హీరో బేస్డ్ కథలా ఉండదు. నటీనటులంతా కథలో భాగం అవుతారు. అలాగే వివేక్ సాగర్ అందించిన సంగీతం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది'.

# యూనిక్ సైకలాజికల్ థ్రిల్లర్

యూనిక్ సైకలాజికల్ థ్రిల్లర్హర్షివ్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటించడంతో పాటు రచన, నిర్మాణం, దర్శకత్వం వహించిన చిత్రం 'బహుముఖం'. గుడ్, బ్యాడ్ అండ్ ది యాక్టర్ అనేది ట్యాగ్‌లైన్. ఈ సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్ అట్లాంటా, మాకాన్, కాంటన్ జార్జియా, యుఎస్ఎ పరిసర ప్రాంతాల్లోని అనేక అద్భుతమైన ప్రదేశాలలో చిత్రీకరించారు. ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా ఈనెల 5న రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో హర్షివ్ కార్తీక్ మీడియాతో మాట్లాడుతూ, 'మానసిక అనారోగ్యం ఉన్న ఓ వ్యక్తి ఆడిషన్‌కు వెళ్తే, అక్కడ అతనికి అవమానం జరిగితే తర్వాత అతను ఎంతవరకూ వెళ్తాడనే అనేది లైన్. కథ రాస్తున్నపుడు స్పాన్ పెరిగింది. ఇలాంటి కథ మన దగ్గర ఇప్పటివరకూ రాలేదనే నమ్మకం కుదిరిన తర్వాత దీనిని ఫీచర్ ఫిల్మ్ లెంత్ చేశాం. ప్రస్తుతం సస్పెన్స్ థ్రిల్లర్స్‌ని ప్రేక్షకులు ఎక్కువగా చూస్తున్నారు. నటుడిగా, దర్శకుడిగా ఓ యూనిక్ ప్రాజెక్ట్‌తో రావాలని ఈ ప్రాజెక్ట్ చేశాను. ఇందులో దాదాపు నలభై మంది కొత్త నటీనటులు కనిపిస్తారు. మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఉండేలా సినిమాని రూపొందించాను. సస్పెన్స్ సైకలాజికల్ థ్రిల్లర్స్‌ని ఇష్టపడే ఆడియన్స్ చాలా బాగా ఎంజారు చేస్తారు. సినిమా అంతా చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. ఫణి కళ్యాణ్



ఇచ్చిన పాటలు ఆద్యంతం అద్భుతం. ఈ సినిమా కోసం చాలా మంచి పాటలని స్వరపరిచారు. నేపథ్య సంగీత కోసం శ్రీచరణ్ పాకాలని సంప్రదించాను. నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఒక యాక్షన్ డ్రామా రాసుకున్నాను' అని తెలిపారు.

# భలే.. వెడ్డింగ్ సాంగ్

భలే.. వెడ్డింగ్ సాంగ్‌జీవీ ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న కామెడీ ఫ్యామిలీ డ్రామా 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. నట్‌మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర పై వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదలకు ఒక్కరోజు గ్యాప్ ఉంటుంది. తమిళ వెర్షన్ ఈనెల 11న విడుదల కానుండగా, తెలుగు వెర్షన్ ఈనెల 12న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'భలే వెడ్డింగ్' పాటని విడుదల చేశారు. ఈ చిత్రానికి మ్యూజిక్ కూడా అందిస్తున్న జీవీ ప్రకాష్ కుమార్ ఈ పాటని ఫుట్ ట్యాపింగ్ వెడ్డింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. రాకేందు మౌళి లిరిక్స్ అందించిన ఈ పాటని నారాయణన్ రవిశంకర్, సింధూరి విశాల్ గ్రేస్ ఫుల్‌గా ఆలపించారు. ఈ పాటలో జివి ప్రకాష్ కుమార్, ఐశ్వర్య రాజేష్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా ఉంది. ఈ వెడ్డింగ్ నెంబర్‌లో వారి డ్యాన్స్ మూమెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమా ఆంధ్రా థియేట్రికల్ హక్కులను




అన్నపూర్ణ స్టూడియోస్ కొనుగోలు చేయగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుంది. హ్యాజ్ థియేట్రికల్ చైన్ బిజినెస్లు ఉన్న ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థల బ్యాకింగ్ తో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో చాలా గ్రాండ్ గా విడుదల కానుంది.

# బర్త్‌డే కానుకగా టీజర్ రిలీజ్

బర్త్‌డే కానుకగా టీజర్ రిలీజ్‌దేశ వ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురు చూస్తున్న చిత్రం 'పుష్ప-2 ది రూల్'. తాజాగా చిత్ర యూనిట్ ఇచ్చిన అప్‌డేట్‌తో అటు అల్లు అర్జున్ అభిమానులు, ఇటు పుష్ప ప్రేమికులు సంబరాల్లో ఉన్నారు.

ఈనెల 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పుష్ప ది రైజ్.. ఎంతటి సంచలన విజయం



సాధించిందో ప్రత్యేకంగా గుర్తు చేయాల్సిన అవసరం లేదు. 2021 బిగ్గెస్ట్ కమర్షియల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది పుష్ప. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలవడంతోపాటు.. తనకు జాతీయస్థాయి అవార్డు తెచ్చి పెట్టిన చిత్రంగా నిలిచింది. దీంతో దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'పుష్ప-2 ద రూల్' చిత్రం పై భారీ అంచనాలు పెరిగాయి. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజరు, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ-కథనం-దర్శకత్వం: సుకుమార్, నిర్మాతలు: నవీన్ ఏర్నేని, వై రవిశంకర్, సినిమాటోగ్రఫర్: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

# డిజిటల్ యుగంలో సరికొత్త అధ్యాయానికి నాంది

డిజిటల్ యుగంలో సరికొత్త అధ్యాయానికి నాందితెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ నిర్వహించిన డిజిటల్ క్రియేటర్స్ మీట్ 'ఆరిజిన్ డే' డిజిటల్ రంగంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలవడమే కాకుండా, అపూర్వమైన మైలురాళ్లను కూడా నెలకొల్పింది. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసి నోవోటెల్‌లో జరిగిన ఈ వేడుకకు 700 మందికి పైగా డిజిటల్ క్రియేటర్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్‌లు హాజరయ్యారు. ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుక, డిజిటల్ క్రియేటర్ కమ్యూనిటీ బలాన్ని, చైతన్యాన్ని ప్రదర్శిస్తూ దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సమావేశంగా నిలిచింది.

ఈ వేడుకలో విజరు దేవరకొండ, మెగాస్టార్ చిరంజీవి మధ్య జరిగిన ఇంటర్వ్యూ ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షించింది. భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రభావవంతమైన ఇద్దరు వ్యక్తుల మధ్య ఎటువంటి దాపరికం లేకుండా హృదయపు లోతులలో నుంచి వచ్చిన మాటలతో జరిగిన ఈ చర్చ, తరాల సినిమా, డిజిటల్ కంటెంట్ సృష్టికి వారధిగా నిలిచింది. ఈ చారిత్రాత్మక వేడుక వివిధ వేదికలలో 100కి పైగా డిజిటల్ సృష్టికర్తల పేజీలు, ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారమై డిజిటల్ రంగంలో మునుపెన్నడూ చూడని ఘనతను సాధించింది. వేడుక ముఖ్య




ఘట్టాలు, ముఖ్యంగా విజరు దేవరకొండ చేతుల మీదుగా 'తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్' సభ్యత్వ కార్డు, చిరంజీవి చేతుల మీదుగా హెల్త్ కార్డ్‌ను ప్రారంభించడం ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చేరువయ్యాయి. డిజిటల్ సృష్టికర్తలు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం, అలాగే వృత్తిపరమైన వృద్ధిని పెంపొందించడంలో 'తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్' నిబద్ధతను ఈ కార్యక్రమాలు నొక్కి చెబుతున్నాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**